ప్రజాశక్తి
శనివారం 6 ఏప్రిల్ 2024
8 పేజీలు
విశాఖపట్నం అనకాపల్లి

సిఎం రమేష్ తీరుపై

కూటమిలో ఆందోళన

◆ చోడవరంలో అధికారులపై దురుసు ప్రవర్తన పట్ల సర్వత్రా చర్చ ◆ నష్టపోతామని భయం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి, చోడవరం విలేకరి కడప జిల్లాకు చెందిన అనకాపల్లి బిజెపి ఎంపీ అభ్యర్థి సిఎం రమేష్ పదవి రాకముందే తన ప్రతాపం చూపించారు. గురువారం డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటిలిజెన్స్ (డిఆర్ఐ) అధికారులపై ఆయన దురుసు ప్రవర్తనతో జిల్లా ప్రజలు విస్తుపోయారు. ఎంపీగా గెలిస్తే ఈ జిల్లాలో తానెలా వుండబోతానో రమేష్ సంకేతమిచ్చినట్లయింది. ఆయన తీరుతో టిడిపి, జనసేన నేతల్లో ఆందోళన మొదలైంది. ఇలాగే ఆయన ముందుకెళ్తే నష్టపోతామన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

అధికారులతో దురుసుగా ప్రవర్తిస్తున్న సిఎం రమేష్ (ఫైల్)

మోడీ ప్రభుత్వ అండచూసో, పెద్ద పారిశ్రామికవేత్తగా ఎదిగిన క్రమంలో వచ్చిన పెత్తనమోగానీ జిల్లాలో ఏనాడూలేని సంస్కృతిని ఆయన తెచ్చిపెట్టారు. చోడవరం గాంధీ గ్రామంలో టైల్స్ షాపులో తనిఖీలు నిర్వహిస్తున్న డిఆర్ఐ అధికారుల విధులకు రమేష్ ఆటంకం కలిగించడమే కాక దురుసుగా ప్రవర్తించారు. అధికారుల చేతిలోని ఫైళ్లను లాగేసుకున్నారు. టర్నోవర్‌కు తగినట్లు ప్రభుత్వానికి పన్ను రావడంలేదని అనుమానమొచ్చినా, ఫిర్యాదు వెళ్లినా నేరుగా తనిఖీలు నిర్వహించడం విజిలెన్స్ అధికారుల విధి. లోపం గుర్తించి సరిచేసేందుకు అకస్మాతుగా వారు తనిఖీలు నిర్వహిస్తారు. గురువారం తమ విధి నిర్వహణలో భాగంగానే టైల్స్ షాపులో తనిఖీలు నిర్వహిస్తుండగా సిఎం రమేష్, టిడిపి చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కెఎస్ఎన్ఎస్.రాజు తన అనుచరులతో వెళ్లి అధికారులతో గొడవకు దిగారు. అధికారుల విధులకు ఆటంకం కల్పించారు. చేతిలో ఫైళ్లను రమేష్ లాక్కొని బెదిరింపులకు దిగారు. పన్ను సరిగా కట్టడంలేదని షాపులో అధికారులు నిర్వహిస్తున్న తనిఖీలకు అడ్డంపడి, దానికి రాజకీయ రంగు పులిమారు.

ఆది నుంచీ అంతే..

పన్నులు ఎగ్గొట్టినా తనిఖీలు చేస్తే సిఎం రమేష్ భరించలేరు. ఐటి దాడుల నుంచి తప్పించుకోవడానికే ఆయన టిడిపి నుంచి బిజెపిలోకి వెళ్లారు. తన ఆస్తులు కాపాడుకోవడానికి ఏ పార్టీ అధికారంలో వుంటే ఆ పార్టీలోకి వెళ్లడం ఆయనకు పరిపాటి. బిజెపిలో వుంటూ పెద్ద ఎత్తున ఎలక్టోరల్ బాండ్లను ఆయన ప్రధాన పార్టీలకు ఇచ్చిన భాగోతం ఇటీవల బయటపడింది. అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో ఒక్క శాతానికి మించి మిగతా 2లో..

క్షతగాత్రులను కెజిహెచ్‌కు తరలిస్తున్న కోస్టుగార్డు బృందాలు

బోటులో పేలిన సిలిండర్

9 మంది మత్స్యకారులకు గాయాలు

సముద్రంలో మత్స్యకారులు చేపల వేట సాగిస్తుండగా బోటులో ఉన్న సిలిండర్ పేలడంతో తొమ్మిది మంది మత్స్యకారులు గాయపడ్డారు. వీరిలో ఐదుగురికి స్వల్పంగా గాయాలయ్యాయి. నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన విశాఖ తీరం నుంచి 65 నాటికల్ మైళ్ల దూరంలో కాకినాడ తీరానికి సమీపంలోని వాకలపూడి వద్ద శుక్రవారం సాయంత్రం జరిగింది. బోటులోని సిబ్బంది ఇచ్చిన సమాచారంతో విశాఖపట్నం నుంచి ఇండియన్ కోస్ట్ గార్డ్ షిప్‌లో సంఘటనా ప్రాంతానికి యుద్ధ ప్రాతిపదికన కోస్ట్‌గార్డు రక్షక దళం బయలుదేరి వెళ్ళింది. గాయపడ్డ మత్స్యకారులను కోస్ట్ గార్డు నౌక సిజిఎస్ వీరలో విశాఖ తీరానికి తీసుకొచ్చారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం కెజిహెచ్‌కు తరలించారు. (ప్రధాన వార్త మెయిన్‌లో..)

ఉక్కుపై కేంద్రం నిర్ణయం మార్చుకోవాలి

▶ వార్త 2లో..

ఎపిలో 6 లోక్‌సభ, 48 అసెంబ్లీ స్థానాలకు పోటీ

▶ వార్త 2లో..

ఘనంగా జాతీయ సముద్రయాన దినోత్సవం

▶ వార్త 2లో..

మ్యానిఫెస్టో ఆవిష్కరిస్తున్న శ్రీభరత్, కూటమి నేతలు

త్వరలో విశాఖలో బహిరంగ సభ

టిడిపి పార్లమెంట్ మ్యానిఫెస్టో ఆవిష్కరణలో నాయకులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : బిజెపి, టిడిపి, జనసేన పార్టీల కూటమి పొత్తు గెలవాలని, పాలన మారాలని శుక్రవారం సాయంత్రం నగరంలోని టిడిపి కార్యాలయంలో విశాఖ టిడిపి ఎంపీ అభ్యర్థి శ్రీభరత్ సహా పలువురు కూటమి నేతలు ఉద్ఘాటించారు. విశాఖలో త్వరలో కూటమి బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కూటమి పార్టీల తరపున విశాఖ పార్లమెంట్‌కు ప్రత్యేకంగా తయారు చేసిన మ్యానిఫెస్టోను శ్రీ భరత్ ఆవిష్కరించారు. విశాఖ ఉక్కును కాపాడటం, మిగతా 2లో..

జగ్జీవన్ రామ్ కృషి మరువలేనిది

సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు

ప్రజాశక్తి - ఉక్కునగరం : అంటరానితనాన్ని రూపుమాపాలని అలుపెరగని పోరాటం నిర్వహించి, అంచలంచెలుగా ఎదిగి దేశ ఉప ప్రధానిగా, కార్మిక శాఖ మంత్రిగా, ఓటమి ఎరుగని నాయకునిగా పేరొందిన డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ చిరస్మరణీయుడని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అన్నారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో డాక్టర్ బాబూ జగజ్జీవన్ రామ్ జయంతి కార్యక్రమం ఉక్కునగరంలోని స్థానిక సిఐటియు కార్యాలయంలో జరిగింది. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కులాలు, మతాలు, ప్రాంతాల ఆధారంగా బిజెపి ప్రభుత్వం విడదీసి దేశాన్ని పాలిస్తోందన్నారు. దళితుల సంక్షేమ పథకాలను పక్కనపెట్టి, దళితులను ఓటు

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జగ్గునాయుడు

బ్యాంకుగా మాత్రమే చూస్తోందని తెలిపారు. మనుధర్మ సిద్ధాంతాన్ని అమలు చేయడానికి పూనుకుంటోందని తెలిపారు. అంబేద్కర్ రాసినటువంటి రాజ్యాంగం దేశాన్ని రక్షిస్తోంది కాబట్టి దాన్ని మార్పు చేయాలని కుట్రలు చేస్తోందన్నారు. బిజెపిని, దాంతో జతకట్టినటువంటి పార్టీలను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు వైటి.దాస్, స్టీల్ ఒబిసి అసోసియేషన్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కూటమిలో ఆందోళన

బిజెపికి ఓటు లేకపోయినా టిడిపి, జనసేన సహకారంతో డబ్బులిచ్చి గెలవాలన్న పట్టుదలతో సిఎం రమేష్ వున్నట్లు కనబడుతోంది. మరోపక్క రమేష్‌తో తమకు ఎన్నికల్లో నష్టం జరుగుతుందన్న ఆందోళన టిడిపి, జనసేన అభ్యర్థుల్లో కన్పిస్తోంది. బాధిత అధికారులు ఇచ్చిన ఫిర్యాదుతో చోడవరం పోలీసు స్టేషన్‌లో సిఎం రమేష్‌పై కేసు నమోదైంది.

త్వరలో విశాఖలో బహిరంగ సభ

రైల్వే జోన్ సాధన, ఐటి, టూరిజం పారిశ్రామిక హబ్‌గా విశాఖను మార్చడం, నూతన టెక్నాలజీతో పోర్టు కాలుష్యాన్ని అరికట్టడం, పోలవరం పూర్తి చేసి విశాఖకు నీరు తీసుకురావడం, ఆనందపురం అగనంపూడి మధ్య నగరంలో ప్రయాణం సాఫీగా సాగేందుకు అవసరమైనచోట ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌వేలు, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు నిర్మించడం కోసం కృషి చేస్తానన్నారు. గత ఐదేళ్లలో దుర్మార్గపు పాలన నడిచిందన్నారు. వైసిపి పాలనలో రాజకీయ నాయకులు ప్రశ్నించే హక్కును కోల్పోయారని తెలిపారు. విశాఖ పార్లమెంట్ పరిధిలోని లోక్ సభ, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలలో కూటమి అభ్యర్థులు మంచి మెజారిటీతో గెలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. విశాఖ ఎంపీగా 2019లో తనపై గెలిచిన ఎంవివి.సత్యనారాయణ ఎంపీ నిధులను గడిచిన కాలంలో కేవలం తూర్పులోనే ఖర్చు పెట్టారని, ఇది మిగతా ప్రజలను అన్యాయం చేసినట్లు కాదా? అని ప్రశ్నించారు. దీని వెనక అక్కడ పోటీ చేయాలనే ముందస్తు వ్యూహం ఉందని తెలుస్తోందన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, బిజెపి జిల్లా అధ్యక్షులు రవీంద్ర, జనసేన నాయకులు బొలిశెట్టి సత్య, శివప్రసాద్ రెడ్డి, ఉషా కిరణ్ పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ కృషి మరువలేనిది

అధ్యక్షులు బి.అప్పారావు, గుర్తింపు ఎస్‌సి, ఎస్‌టి ఎంప్లాయీస్ అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యనారాయణ, సిపిఎం స్టీల్ డివిజన్ కార్యదర్శి శ్రీనివాసరాజు, స్టీల్ సిఐటియు ప్రధాన కార్యదర్శి కె.రామస్వామి, కెవిపిఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి టి.చిరంజీవి, వరకుమార్, పుల్లారావు, మనోజ్, నాగరాజు, శేఖర్, సుబ్రహ్మణ్యం, నారాయణ పాల్గొన్నారు.

అనకాపల్లి : దళితులు, వెనుకబడిన తరగతుల వారి అభ్యున్నతికి భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్ రామ్ చేసిన కృషి మరువలేనిదని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకర్రావు అన్నారు. సిపిఎం జిల్లా కార్యాలయంలో జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ నేడు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతోన్మాదాన్ని పెంచి పోషిస్తుందని, మనువాద రాజ్యాంగాన్ని తీసుకు రావడానికి ప్రయత్నిస్తుందని, తాము మళ్లీ అధికారంలోకి వస్తే మొత్తం రాజ్యాంగాన్ని మార్చేస్తామని బిజెపి ఎంపీలు చెప్పడమే ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. దళితులకు రిజర్వేషన్ రద్దు చేయాలని యోచనలో ఉందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు ఉంటేనే దళిత వెనుకబడిన తరగతులు, మహిళలకు రిజర్వేషన్ అమలు జరుగుతుందని, అలాంటిది నేడు మోడీ ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం, మూసివేయడం చేస్తుందని తెలిపారు. దేశభక్తి పేరుతో దేశానికి ద్రోహం చేసే చర్యలకు బిజెపి పాల్పడుతుందని విమర్శించారు. జగ్జీవన్ రామ్ ఆశయాలు ముందుకు తీసుకువెళ్లాలంటే అనకాపల్లి పార్లమెంట్‌కు పోటీ చేస్తున్న బిజెపి అభ్యర్థిని ఓడించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అల్లు రాజు, నాయకులు కాళ్ల తెలయ్య బాబు, బుగిడి నూక అప్పారావు, పి.చలపతి, ఈశ్వర్రావు, కరణం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో నివాళ్లర్పిస్తున్న నాయకులు

సిఐటియు ఆధ్వర్యాన

పరవాడ : పరవాడ ఎస్సీ కాలనీలో సిఐటియు నాయకులు జగ్జీవన్ రావ్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ అణగారిన వర్గాల సమస్యలపై పోరాడిన గొప్ప యోధుడని పేర్కొన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా ఆయన పోరాటం చేశారని, ఆయన్ను ఆదర్శంగా తీసుకొని నేడు మతోన్మాదాన్ని రెచ్చగొడుతున్న బిజెపికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జె.రామలక్ష్మి, ఎం కొండమ్మ, ఎం అనిత, కే హేమలత, జై నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

మసీదుల ఆధునికీకరణకు కృషి చేస్తా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దక్షిణ నియోజకవర్గంలో ఎన్నో ప్రసిద్ధి చెందిన పురాతన మసీదులు ఉన్నాయని, వాటి ఆధునికీకరణకు కృషి చేస్తానని వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ కుమార్ హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా జగదాంబ జంక్షన్‌లో ఉన్న మక్కా మసీదులో శుక్రవారం ఆయన ప్రచారం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఇంత వరకు నియోజకవర్గంలో మసీదులకు ఎలక్ట్రికల్ ట్రాన్స్‌ఫార్మర్లు అందజేశానని చెప్పారు.

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ సెల్ కొనసాగించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసుల సత్వర దర్యాప్తు కోసం దశాబ్దాలుగా ఉన్న ప్రత్యేక పోలీసు విభాగాన్ని కొనసాగించాలని విదసం ఐక్య వేదిక నాయకులు శుక్రవారం కలెక్టరును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా విదసం కన్వీనర్ డాక్టర్ బూసి వెంకటరావు మాట్లాడారు. సోడ దాసి సుధాకర్, జాజి ఓంకార్, బూల భాస్కర రావు, మందా శ్రీనివాస్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఎపిలో 6 లోక్‌సభ, 48 అసెంబ్లీ స్థానాలకు పోటీ

తొలి విడత అభ్యర్థులను ప్రకటించిన జై భారత్ నేషనల్ పార్టీ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2024 సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి తొలి విడతగా ఎపిలో ఆరు లోక్‌సభ, 48 అసెంబ్లీ స్థానాలకు జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఆ వివరాలను శుక్రవారం సాయంత్రం ఎంవిపి.కాలనీలోని పార్టీ ఉత్తరాంధ్ర కార్యాలయంలో జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వివి.లక్ష్మీనారాయణ ప్రకటించారు. ఉగాది తర్వాత మిగతా అభ్యర్థుల జాబితా ప్రకటిస్తామన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అరకు, శ్రీకాకుళం, అనకాపల్లి, కాకినాడ, కర్నూలు, హిందూపూర్ ఎంపీ స్థానాలతో పాటు తెలంగాణాలో మెదక్, మల్కాజ్‌గిరి, నాగర్ కర్నూల్ ఎంపీ స్థానాల్లో పోటీ చేయబోతున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ రాజకీయ పార్టీలు కుల, మతాల ఆధారంగా అభ్యర్థులను ప్రకటిస్తుంటే తాము అందుకు భిన్నంగా విద్యార్హత ఆధారంగా అభ్యర్థులను ఎంచుకుంటున్నామని, చదువుకున్న వారు, సామాజిక సేవా దృక్పథం ఉన్నవారికే సీట్లు కేటాయిస్తున్నామని తెలిపారు. నియోజకవర్గాల వారీగా మ్యానిఫెస్టోలు తయారు చేస్తున్నామన్నారు. అప్పులు, అవినీతి లేని, డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఎపిని తీర్చిదిద్దడమే తమ ధ్యేయమన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని అరకు నుంచి చంటి బాబు, శ్రీకాకుళం నుంచి ఇప్పిలి సీతరాజు, అనకాపల్లి నుంచి శరత్ చంద్ర, కాకినాడ నుంచి అదాత్ర వెంకన్న దొర, కర్నూల్ నుంచి శంకర్ శ్రీధర్ పోటీ చేస్తారన్నారు.

7న విశాఖ కళాకారుల ఉగాది వేడుకలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ కళాకారుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7న ఉగాది ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సినీ నిర్మాత, ఉపకార్ స్వచ్ఛంద సేవాసంస్థ అధినేత డాక్టర్ కంచర్ల అచ్యుతరావు తెలిపారు. శుక్రవారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ నుంచి జాతీయ, అంతర్జాతీయ స్థాయి వేదికలపై ప్రతిభ కనబరుస్తున్న కళాకారులను గుర్తించి గౌరవించడం గర్వించదగ్గ విషయ మన్నారు. సంస్థ అధ్యక్షుడు జనార్దన్ మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జబర్దస్త్ ఆర్టిస్టు రాపేటి అప్పారావు, ఎయు ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని, జాతీయ నృత్య కళాకారిణి గోక డింపుల్ (స్కూల్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్), ప్రముఖ కూచిపూడి నృత్య దర్శకుడు టి.సందీప్, పల్సర్ బైక్ ఝాన్సీ, సినీ కొరియోగ్రాఫర్ సిహెచ్.రమేష్ మాస్టర్, పౌరాణిక కళాకారులు యడ్ల గోపాలరావు, హరికథా కళాకారులు నారాయణ భాగవతార్, ప్రముఖ సినీ గాయకులు ఇతేషసాయి, రమేష్ పట్నాయక్, నాటకరంగ ప్రముఖులు పి.వి.శివప్రసాద్, ఎస్.డేవిడ్ రాజా (నంది అవార్డు గ్రహీత), ఇంద్రజాలికుడు కె.అమర్‌నాథ్, బొట్టు నాగేశ్వరరావులకు ఉగాది విశిష్ట కళా ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సేవా సంఘం గౌరవ అధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, బ్రహ్మకుమారి రామేశ్వరి, ఇండియన్ ఫోక్ కొరియోగ్రాఫర్ ఆర్.నాగరాజ్ పట్నాయక్, సినీ దర్శకులు మెహర్ ప్రసాద్, కన్నం వెంకట రమణరావు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఘనంగా జాతీయ సముద్రయాన దినోత్సవం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : జాతీయ సముద్రయాన దినోత్సవాన్ని విశాఖపట్నం పోర్టు అథారిటీలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మారిటైం రంగంలో విశేష సేవలు అందించిన సిబ్బందిని ఘనంగా సత్కరించారు. డిప్యూటీ కన్జర్వేటర్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమానికి చీఫ్ విజిలెన్స్ అధికారి పిఎస్ఎల్.స్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ రంగంలో విశేష సేవలు అందించి అసువులు బాసిన సిబ్బందికి నివాళులు అర్పించారు. అనంతరం పోర్టు ఫ్లీట్ ఆఫ్ టగ్స్ గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఆర్థిక వృద్ధిలో సముద్రయాన రంగం కీలక భూమిక పోషిస్తోందని తెలిపారు. రవాణా రంగంలో సముద్రయానం, నౌకాయానం అనేవి సులువైన, చౌకైన రవాణా మార్గాలని తెలిపారు. మేజర్ పోర్టులలో అత్యధికంగా సరుకు రవాణా చేస్తూపోర్టు సముద్రయాన రంగంలో తనదైన పాత్రను పోషిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో కోస్ట్‌గార్డ్ డిఐజి రాజేష్ మిట్టల్, దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

రేపు హెచ్ఆర్ఎఫ్ పాతికేళ్ల ప్రస్థానంపై డాక్యుమెంటరీ

ప్రజాశక్తి-విశాఖపట్నం : మానవ హక్కుల వేదిక (హెచ్ఆర్ఎఫ్) పాతికేళ్ల ప్రస్థానంపై ఆదివారం ఉదయం 10 గంటలకు డాబాగార్డెన్స్‌లోని అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో కె.సుధ ప్రసంగించనున్నారు. ఈ సందర్భంగా హక్కుల యోధుడు బాలగోపాల్‌పై డాక్యుమెంటరీ చిత్ర ప్రదర్శన వుంటుంది. ఈ మేరకు వేదిక ఎపి, తెలంగాణ రాష్ట్రాల సమన్వయ కమిటీ మెంబర్ విఎస్.కృష్ణ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఉక్కుపై కేంద్రం నిర్ణయం మార్చుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ రంగంలోని విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను హైకోర్టు తప్పు పట్టిందని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షులు కె.ఎ.పాల్ అన్నారు. ఇప్పటికైనా మోడీ సర్కారు తన తీరును మార్చుకోవాలని హితవు పలికారు. శుక్రవారం రైల్వే న్యూ కాలనీలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ సరికాదని తాను హైకోర్టులో కేసు వేసిన విషయాన్ని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కూడా స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయవద్దని కేంద్ర ప్రభుత్వానికి ప్రత్యేకంగా లేఖ రాశారని తెలిపారు. స్వయంగా ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి రాసిన లేఖను కేంద్ర ప్రభుత్వం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా కేంద్రం స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయనని ప్రకటించాలన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కోర్టులో నాలుగు కేసులు ఉన్నాయన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు 8 లక్షల కోట్ల విలువైన ఆస్తులు ఉన్నాయని, వాటిని కేవలం 8 వేల కోట్లకు అమ్మకానికి పెట్టడం దుర్మార్గమని అన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో ఇంకా 8500 పోస్టులు నిర్వాసితులతో భర్తీ చేయాల్సి ఉందన్నారు. చంద్రబాబు, జగన్మోహన్ రెడ్డి విశాఖను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. తాను విశాఖ పార్లమెంటు స్థానం నుంచి పోటీ చేస్తున్నానని, తాను విజయం సాధిస్తే సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

ఆర్‌కె బీచ్‌లో ఎంవివి ప్రచారం

బీచ్ రోడ్డులో ప్రచారం నిర్వహిస్తున్న ఎంవివి.సత్యనారాయణ

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వైసిపి తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే అభ్యర్థి ఎంవివి.సత్యనారాయణ జివిఎంసి 20, 21వ వార్డు, ఆర్‌కె బీచ్ వాకర్స్ పార్కులలో శుక్రవారం ఉదయం తన ఎన్నికల ప్రచారం చేపట్టారు. వాకర్స్‌ను, సీనియర్ సిటిజెన్సును మర్యాద పూర్వకంగా కలిసి ఓటు అభ్యర్థించారు. ఆయన వెంట వైసిపి నాయకులు ముప్పల సురేష్, మధుపాడ రవికుమార్, వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఉన్నారు. అలాగే 17వ వార్డు ఎంవిపి.కాలనీ సెక్టార్-8లో వార్డు కార్పొరేటర్ గేదెల లావణ్య, నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎంవివి పాల్గొన్నారు. పాదయాత్ర చేపట్టారు.

IN THE HONOURABLE COURT OF THE 4th ADDITIONAL DIST CIVIL JUDGE AT SRIKAKULAM
E.P. No. 130 /2023 IN A.A. No. 671/2021

Between:
M/s Shriram Transport Finance Company Limited, Represented by Recovery Executive & G.P.A. Holder, Vishakapatnam, rept by its DHr Bonu Venkata Ravisankar.
... Decree Holder

And:
Tillangi Prakasa Rao & another
... Judgment Debtors

NOTICE

To,
1) Tillangi Prakasa Rao, S/o Mukhalingam, Hindu, Aged 45 years, Sarubujjili Vill & Md, Presently residing at D.No. 56-2-89, Pharmacity Colony, E- Marripalem Vill & Post, GajuwakaMandal, VishakapatnamDist

Please take notice that the petitioner/D.Hr filed above EP against the 1st Jdr U/O 21 R 54 CPC, and the above matter is stands posted to **18-04-2024** for your appearance, and you are to appear on aforesaid date before the Honourable 4th Additional District Judge, Srikakulam at about **10.30 a.m** in person or through pleader, otherwise the above matter will decide against you. Hence this Notice.

SAKALABHAKTULA SAIKISHORE
Advocate for DHr
Srikakulam-532001
Cell: 9493659846
Srikakulam
Dt:05-04-2024

అవినీతి నిర్మూలనే 'జైభారత్' లక్ష్యం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : అవినీతి నిర్మూలనే లక్ష్యంగా జై భారత్ నేషనల్ పార్టీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సన్నద్ధమైందని ఆ పార్టీ పెందుర్తి నియోజకవర్గం కో-ఆర్డినేటర్ కన్నేపల్లి మహాదేవ్ కల్యాణ్ శ్రీకాంత్ తెలిపారు. విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా, యువతకు ఉద్యోగ అవకాశాలు, ఉచిత విద్య, అభివృద్ధి దిశగా తమ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుల ధ్యేయం అన్నారు. గత ప్రభుత్వాలు ఎన్నికల మేనిఫెస్టోలో ప్రజలకు ఇచ్చిన హామీలు తుంగలో తొక్కాయని విమర్శించారు. తమ పార్టీ అధినేత వివి.లక్ష్మీనారాయణ ఆశయాలు, సిద్ధాంతాలకు తాము కట్టుబడి ఉన్నామన్నారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే కుటుంబానికి ఉపాధి, ప్రతి పంచాయతీకీ పది చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, ప్రతి నియోజకవర్గానికి ఒక భారీ పరిశ్రమ, కొత్తగా పట్టణ ఉపాధి హామీ పథకం, నాణ్యమైన రోడ్ల నిర్మాణం, రోడ్డు భద్రతా చట్టం అమలు, పర్యాటక అభివృద్ధి, ఆధ్యాత్మిక, పర్యావరణ, సాంస్కృతిక, క్రీడా, తీర ప్రాంత సర్క్యూట్ల ఏర్పాటు, మద్యపాన నిషేధం, ప్రతి నియోజకవర్గ అభివృద్ధికి ఏడాదికి రూ.100 కోట్ల కేటాయింపు, పెట్రోల్, డీజిల్‌పై రాష్ట్ర పన్ను తగ్గింపు తదితర అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేసి తీరుతామని చెప్పారు. ఈ సమావేశంలో పార్టీ అనకాపల్లి ఇంచార్జ్ ఆడారి శరత్ చంద్ర, పెందుర్తి ఇంచార్జ్ రవితేజ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కన్నేపల్లి మహాదేవ్ కళ్యాణ్ శ్రీకాంత్ తదితరులు

నేరాలు ఘోరాలు

ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి- ఆనందపురం : ఆనందపురం మండలంలో సోంట్యాం వద్ద ద్విచక్ర వాహనం ఢీకొని అదే గ్రామానికి చెందిన బొద్దపు సూర్యనారాయణ(58) మృతిచెందాడు. ఆనందపురం పోలీసుల కథనం ప్రకారం... సూర్యనారాయణ భార్య చిన్నమ్మలు ఉపాధి హామీ పనులకు వెళ్లారు. ఆమెకు భోజనం పట్టుకుని వెళుతున్న సూర్యనారాయణ సొంట్యాం రోడ్డు దాటుతుండగా పెందుర్తి వైపు నుంచి ఆనందపురం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న మహిళ బలంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో సూర్యనారాయణ తలకు తీవ్ర గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం విశాఖ కెజిహెచ్ తరలించారు. చికిత్స పొందుతూ సూర్యనారాయణ మృతిచెందాడు. ద్విచక్ర వాహనం నడుపుతున్న మహిళలకు స్వల్ప గాయాలయ్యాయి. మృతుని కుమారుడు నాగేశ్వరరావు ఫిర్యాదు మేరకు సిఐ తిరుపతిరావు ఆధ్వర్యాన ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాదాస్పద స్థలంలో నిర్మాణం అడ్డగింత

ప్రజాశక్తి - ఆరిలోవ : వివాదాస్పద స్థలంలో చేపట్టిన నిర్మాణాలను జివిఎంసి అధికారులు శుక్రవారం అడ్డుకున్నారు. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. జివిఎంసి 12వ వార్డు పరిధి ఆరిలోవ శ్రీకాంత్‌నగర్‌లో సుమారు ఐదు ఎకరాల ఖాళీ స్థలం ఉంది. ఇది జివిఎంసి స్థలమని అధికారులు చెబుతున్నారు. ఈ స్థలం తనదేనని సత్యనారాయణ అనే వ్యక్తి చెబుతున్నారు. ఈ వివాదం కోర్టులో ఉంది. అయితే శుక్రవారం సత్యనారాయణ తన అనుచరులతో వచ్చి ఆ స్థలంలో ప్రహరీ నిర్మాణ పనులు ప్రారంభించారు. సమాచారం తెలుసుకున్న జివిఎంసి టౌన్‌ప్లానింగ్ ఎసిపి శాస్త్రి, సిబ్బంది వచ్చి పనులను అడ్డుకున్నారు. సత్యనారాయణకు జివిఎంసి అధికారుల మధ్య వాగ్వివాదం జరిగింది. కోర్టులో తేలిన తరువాతనే పనులు ప్రారంభించాలని అధికారులు చెప్పడంతో అక్కడి నుంచి సత్యనారాయణ వెనుదిరిగారు.

వస్త్ర ప్రదర్శనను ప్రారంభిస్తున్న మోడల్

నగరంలో ఉగాది సంప్రదాయ వస్త్రాల సందడి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నాలుగు రోజులు పాటు గ్రీన్ పార్క్ హోటల్‌లో సంప్రదాయ వస్త్రాల ఎక్స్‌పో శుక్రవారం ప్రారంభమైంది. నగరానికి చెందిన ప్రముఖ మోడల్ దీనిని ప్రారంభించి ఎగ్జిబిషన్‌లో ఉంచిన వివిధ రకాల వస్త్రాలను పరిశీలించి సందడి చేశారు. ఎక్స్‌పో నిర్వాహకులు మీడియాతో మాట్లాడుతూ, జాతీయస్థాయిలో నేరుగా వీవర్స్ రూపొందించిన వస్త్రాల ప్రదర్శన, చేనేత ఉత్పత్తుల అమ్మకాలు ఈ నెల 8వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఈ ఎక్స్‌పోలో వివాహ, పండగ కోసం, అద్భుతంగా రూపొందించిన పట్టు చీరలు, కాటన్ చీరలు, సూట్, డ్రెస్ మెటీరియల్స్, చేనేత వస్త్రాలు, ఫ్యాషన్ జ్యూయలరీ, ఇంకా ఎన్నెన్నో దేశం నలుమూలల నుండి తెచ్చిన ఎన్నో వస్తువులు ప్రదర్శనలో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ప్రదర్శన, అమ్మకాలు ప్రతిరోజూ ఉదయం 11 గంటల నుంచి రాత్రి 8:30 గంటల వరకు ఉంటాయన్నారు. ప్రవేశం ఉచితం అని తెలిపారు. అన్ని రకాల డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా చెల్లింపులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు.

పలుచోట్ల ముత్తంశెట్టి ప్రచారం

జివిఎంసి నాలుగో వార్డులో ప్రచారంచేస్తున్న ముత్తంశెట్టి

ప్రజాశక్తి -యంత్రాంగం

భీమునిపట్నం : జివిఎంసి 4వ వార్డు పరిధి చేపలుప్పాడలో స్థానిక వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి బ్రోచర్లు అందజేశారు. మే 13న జరుగు సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, విశాఖ లోక్‌సభ అభ్యర్థిగా బొత్స ఝూన్సీని గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. ఎటువంటి వివక్ష లేకుండా అర్హత కలిగిన వారందరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందించిన జగన్మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేములవలసలో

ఆనందపురం : మండలంలోని వేములవలసలో ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి అభ్యర్థులను గెలిపించి జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని కోరారు. గత నాలుగున్నరేళ్లుగా చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బంక సత్యం, జడ్‌పిటిసి సభ్యులు కోరాడ వెంకటరావు, నాయకులు గంర్రెడ్డి శ్రీనివాస్, కోరాడ దశరద రాంబాబు, కోరాడ అప్పలస్వామినాయుడు, దొంతల గోపీకృష్ణ, సిడం సత్యనారాయణ, కెపి.రాజు, కడగల్ల నారాయణరావు, తాడి పైడిరాజు, దొంతల రమణమ్మ, పతివాడ నర్సింగరావు, బోధ నారాయణప్పడు తదితరులు పాల్గొన్నారు.

గొల్ల బాబూరావును సత్కరిస్తున్న వైసిపి నాయకులు

గొల్ల బాబూరావుకు సత్కారం

ప్రజాశక్తి -మధురవాడ : రాజ్యసభ సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసి శుక్రవారం మొట్టమొదటిసారిగా విశాఖపట్నంలోని వైసిపి కార్యాలయానికి విచ్చేసిన రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావును పార్టీ జిల్లా అధ్యక్షులు కోలా గురువులు, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్యే వరుదు కల్యాణి, నాయకులు జి.రవిరెడ్డి, విఎంఆర్‌డిఎ చైర్మన్ సనపల చంద్రమౌళి తదితరులు సత్కరించారు.

కార్ టి థెరపీతో లింఫోమా కేన్సర్‌కు చికిత్స

ప్రజాశక్తి - ఆరిలోవ : లింఫోయా కేన్సర్ బారిన పడ్డ మహిళకు అపోలో వైద్యులు కార్ టి థెరపీతో చికిత్స అందించి విజయం సాధించారు. ఆరిలోవలోని అపోలో ఆసుపత్రిలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో కేన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ రాకేష్ బోయ బృందం సభ్యులు వివరాలు వెల్లడించారు. అరుదైన లింఫోమా కేన్సర్‌తో బాధపడుతున్న విజయనగరం జిల్లా బొబ్బిలి ప్రాంతానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు రెడ్డి లలిత కుమారి (47)కి ఈ ఆధునిక వైద్యం అందించి ప్రాణాలు కాపాడినట్లు తెలిపారు. మానవ శరీరంలో ఉన్న టి సెల్స్‌ను సేకరించి ప్రయోగశాలలో మెడికల్ ఇంజినీరింగ్ నైపుణ్యంతో కేన్సర్‌ను పారద్రోలే విధంగా ఈ కణాలలో కొత్త మార్పులను తెచ్చి శరీరంలో మరలా ప్రవేశింపజేసే చికిత్స అని పేర్కొన్నారు. ఈ నూతన సెల్స్ ఉపరితలంపై ప్రోటీన్ అనగా కార్ (చిమీరిక్ యాంటిజెన్ రిసిప్టటర్స్) జత చేయడం జరుగుతుందన్నారు. ఇలా మార్పు చెందిన కార్ టి సెల్స్ శరీరంలో ఉన్న కేన్సర్ కణాలను నశింప చేయడంలో ప్రముఖ పాత్ర వహిస్తాయని వివరించారు. ఈ సమావేశంలో డాక్టర్ ప్రదీప్, డాక్టర్ వేణి ప్రసన్న, సిఇఒ శ్రీరామచంద్ర పాల్గొన్నారు. కేన్సర్‌ను జయంచి ప్రాణాలతో బయట పడిన లలిత కుమారి మాట్లాడుతూ అపోలో వైద్యులు నాలో ధైర్యం నింపి అన్ని విధాలా సహకరించి ప్రాణాపాయం నుంచి కాపాడినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న అపోలో వైద్యులు

గంటాతో భేటీలో కోరాడ తదితరులు

కోరాడ, సందీప్‌తో గంటా భేటీ

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి నియోజక వర్గ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గంటా శ్రీనివాసరావు అతని నివాసంలో శుక్రవారం సాయంత్రం టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కోరాడ రాజబాబు, జనసేన నియోజక వర్గ కన్వీనర్ పంచకర్ల సందీప్‌తో విడివిడిగా భేటీ అయ్యారు. రానున్న ఎన్నికల్లో టిడిపి విజయానికి సమిష్టిగా కృషిచేయాలనే నిర్ణయానికి వచ్చారని గంటా క్యాంప్ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఎస్ఎస్ఎన్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో..

ఎంటెక్, ఎంఇ కోర్సులకు దరఖాస్తులు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : గుర్తింపు పొందిన ఎస్ఎస్ఎన్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో మాస్టర్ ఆఫ్ ఇంజినీరింగ్ (ఎంఇ), మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ (ఎంటెక్) ప్రవేశ ప్రక్రియకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రెసిడెంట్ డాక్టర్ కళా విజయకుమార్ తెలిపారు. నగరంలోని ఒక హోటల్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఎన్ఐఆర్ఎఫ్ 2023 ప్రకారం ఇంజినీరింగ్ విభాగంలో తమిళనాడులో 45వ ర్యాంక్ సాధించిందన్నారు. అన్ని రంగాలలో రాణించడానికి అవసరమైన నైపుణ్యంతో విద్యార్థులను సన్నద్ధం చేయడానికి ఈ కోర్సులు సూక్ష్మంగా రూపొందించామని తెలిపారు. టెలికమ్యూనికేషన్స్, కంప్యూటర్ సైన్స్, పునరుత్పాదకశక్తి, ఆరోగ్య సంరక్షణ, పర్యావరణ శాస్త్రం తదితర కోర్సులు ఉన్నాయన్నారు. ఇవి పరిశ్రమల డిమాండ్లను తీరుస్తాయని తెలిపారు. 9 పీజీ కోర్సుల్లో ఒక్కో దానిలో 18 సీట్లు ఉన్నాయన్నారు. ప్రతిభ ఆధారంగా ఈ కోర్సుల్లో ప్రవేశం ఉంటుందని తెలిపారు. గేట్, టిఎఎన్‌సిఇటి స్కోర్లు కూడా పరిగణనలోకి తీసుకుంటామన్నారు.

భూమి ఆక్రమణకు యత్నిస్తున్నారంటూ ఆర్‌డిఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆనందపురం మండలం చందకలో ఏళ్ల తరబడి తమ అధీనంలో ఉన్న 67 సెంట్ల భూమిని కొందరు దౌర్జన్యంగా ఆక్రమించేందుకు చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగా అక్కడున్న సిసి కెమెరా పరికరాలను దొంగలించుకు పోయినట్లు బాధితురాలు మీసాల శ్రీదేవి శుక్రవారం స్థానిక ఆర్‌డిఒ ఎస్.భాస్కరరెడ్డికి ఫిర్యాదు చేశారు. తాళం విరగ్గొట్టి రేకుల షెడ్డులో ఉన్న సిసి కెమెరాలకు సంబంధించిన కొన్ని పరికరాలను దొంగలించుకు పోయినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తమ భూమికి, తమకు రక్షణ కల్పించాలని కోరారు.



వెంకటస్వామికి ఉగాది పురస్కారం అందించిన భువనచంద్ర

వెంకటస్వామికి ఉగాది పురస్కారం

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : మద్రాస్ విశ్వవిద్యాలయ తెలుగు విభాగం ఆధ్వర్యాన చెన్నైలోని మెరీనా ఆవరణలో జరిగిన శ్రీ క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలలో ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు విభాగ ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామి ఉగాది పురస్కారం అందుకున్నారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు అధ్యక్షతన జరిగిన ఉగాది వేడుకలలో వెంకటస్వామికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సినీ గేయరచయిత భువనచంద్ర పురస్కారాన్ని అందించారు. ఈ సందర్భంగా భువనచంద్ర మాట్లాడుతూ, తెలుగు భాష సాహిత్యానికి సేవ చేసే వారికి అవార్డు వస్తాయన్నారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య విస్తాలి శంకరరావు డాక్టర్ బూసి వెంకటస్వామి సేవలను కొనియాడుతూ సత్కరించి ప్రశంసాపత్రాన్ని చదివి వినిపించారు. మద్రాస్ విశ్వవిద్యాలయం ఉగాది పురస్కారం అందుకున్న వెంకటస్వామికి తెలుగు సాహిత్యాభిమానులు అభినందనలు తెలియజేశారు.


సత్యనారాయణను సన్మానిస్తున్న న్యాయవాదులు

న్యాయవాదుల సంఘం అధ్యక్షులుగా సత్యనారాయణ

ప్రజాశక్తి-లీగల్ : విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్షులుగా బెవరా సత్యనారాయణ గెలుపొందారు. గురువారం జరిగిన న్యాయవాదుల సంఘం ఎన్నికల్లో అదే రాత్రి 7 గంటల నుంచి లెక్కింపు ప్రారంభమైంది. సుమారు 960 ఓట్లు లెక్కించే సరికి రాత్రి2 గంటలు అయింది. అభ్యర్థులందరి సమ్మతితో శుక్రవారం 12 గంటల నుంచి మిగతా ఓట్లు లెక్కించేందుకు నిర్ణయించి కౌంటింగ్ నిలిపివేశారు. శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన ఓట్ల లెక్కింపు రాత్రి 7 గంటల వరకు కొనసాగింది. 7 గంటల ప్రాంతంలో అభ్యర్థుల గెలుపును ఎన్నికల అధికారి కెవి నరసింహమూర్తి ప్రకటించారు.

చతుర్ముఖ పోటీలో సీనియర్ న్యాయవాది బెవరా సత్యనారాయణ తన సమీప ప్రత్యర్థి నమ్మి సన్యాసియాదవ్‌పై విజయం సాధించారు. ప్రధాన కార్యదర్శిగా దంతా నరేష్‌కుమార్ జాయింట్ సెక్రెటరీగా అడపా సుధాకర్, కోశాధికారిగా చొప్పా అశోక్‌కుమార్, సాంస్కృతిక కార్యదర్శిగా సింహాద్రి యాదవ్, లైబ్రరీ సెక్రెటరీగా మాధవి లత, 20 ఇయర్స్ సీనియర్ మెంబర్‌గా అడారి అప్పారావు గెలుపొందారు. జూనియర్ కార్య నిర్వాహక సభ్యుల ఓట్ల లెక్కింపు శనివారం చేయనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

టిడిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : మాజీ కార్పొరేటర్ మన్యాల సోమబాబు అనుచరులతో కలిసి శుక్రవారం ఎంవిపి కాలనీలో గంటా శ్రీనివాసరావు నివాసంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వారితో పాటు మరికావలస గ్రామ పెద్ద ముచ్చి రామునాయుడు, సాయిరాం కాలనీకి చెందిన గురుగుపల్లి యోగేశ్వరావు వారి అనుచరులతో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, నాగోతి వెంకట సత్యనారాయణ, మొల్లి లక్ష్మణరావు, వాండ్రాసి అప్పలరాజు, నమ్మి శ్రీనివాస్, ఈగల రవికుమార్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలను నిషేధించాలి

ప్రజాశక్తి-విశాఖపట్నం : బాల్యవివాహాలను నిషేధించినప్పుడే సామాజిక ప్రగతి సాధ్యపడుతుందని డాక్టర్ దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కె.సుధ అభిప్రాయపడ్డారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం జాతీయ సేవా పథకం సెమినార్ హాల్లో ప్రోగ్రాం అధికారులకు మూడు రోజులపాటు నిర్వహిస్తున్న 'యువజన హక్కులు- న్యాయ సహాయం' అనే అంశంపై శిక్షణా కార్యక్రమంలో రెండవ రోజైన శుక్రవారం బాల్య వివాహాల నిషేధ చట్టం - 2006పై ఆమె ప్రసంగించారు. బాల్యవివాహాలు బాలల పాలిట శాపాలన్నారు. అనంతరం బాల కార్మిక నిషేధ చట్టంపై ఆచార్య ఎస్.నిర్మల, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఏక్ట్ - 2000 పై డాక్టర్ దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ సి.పి.నందిని, పని ప్రదేశాలలో లైంగిక వేధింపుల నిషేధ చట్టం- 2013పై ఆంధ్ర విశ్వవిద్యాలయ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ లా కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య వి.విజయలక్ష్మి కీలక ప్రసంగాలు చేశారు. డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమాల్లో జాతీయ సేవా పథక ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎస్.హరినాథ్, డాక్టర్ పల్లవి, 40 మంది ప్రోగ్రాం అధికారులు, జాతీయ సేవా పథక కార్యాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ కె.సుధ

25వ వార్డులో వైసిపి ఆత్మీయ సమావేశం

ఉత్తర నియోజకవర్గంలో ప్రచారం చేస్తున్న కెకె.రాజు

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 25వ వార్డు పరిధి సీతంపేటలో కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యాన శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యకర్తలు, వార్డు ముఖ్య నాయకులతో ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేశారన్నారు. ఎన్నికల ప్రచారంలో సైతం స్థానిక ప్రజల నుంచి మంచి ఆదరణ లభిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, వైసిపి నాయకులు ఆళ్ల శివ గణేష్, సంపంగి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

49వ వార్డులో ప్రచారం

జివిఎంసి 49వ వార్డు పరిధి మురళీనగర్ ఎన్జీవోస్ కాలనీలో శ్రీ వైభవ వెంకటేశ్వర స్వామిని కెకె.రాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వైసిపి మహిళా విభాగం సిటీ జనరల్ సెక్రటరీ ఎం.లక్ష్మి ఆధ్వర్యాన నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో కెకె.రాజు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి వైసిపి ప్రభుత్వ హయాంలో ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జగన్మోహన్‌రెడ్డి పాలలో మహిళలకు పూర్తి స్వేచ్ఛ, తగిన రక్షణ ఉంటుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, పేడాడ రమణకుమారి, పీలా ఉమారాణి, ఆడ్డాల కృపాజ్యోతి, కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, కంటిపాము కామేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

24వ వార్డులో కార్యాలయం ప్రారంభం

జివిఎంసి 24వ వార్డు నక్కవానిపాలెంలో కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యాన ఏర్పాటుచేసిన వైసిపి ఎన్నికల పార్టీ కార్యాలయాన్ని కెకె.రాజు, చొక్కాకుల వెంకటరావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, విఎంఆర్‌డిఎ ఛైర్మన్ సనపల చంద్రమౌళి, కార్పొరేటర్ శశికళ, నాయకులు అశోక్‌రెడ్డి, జి.వి.రమణి, మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-సీతమ్మధార : జివిఎంసి 46వ వార్డు పరిధి కైలాసపురం రోడ్డు శాంతినగర్‌లో సీతారాముల చంద్రస్వామి ఆలయ సముదాయానికి ఉత్తర నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, జివిఎంసి కో -ఓప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, వైసిపి నాయకులు ఆళ్ల శివ గణేష్, బి.గోవింద్, చిన్నదూది నరసింగరావు, కోట రామారావు, కె.లావణ్య పాల్గొన్నారు.

వార్డు పరిధి మధుసూదన్ నగర్ వద్ద వాసుపల్లి అమ్మోరు ఆధ్వర్యాన నిర్వహించిన నూకాంబిక అమ్మవారి ఉత్సవాల్లో కెకె.రాజు, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఆళ్ల శివ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

జోరుగా వైసిపి ప్రచారాలు

37వ వార్డులో వాసుపల్లితో కలిసి ప్రచారం చేస్తున్న బొత్స ఝాన్సీ

37వ వార్డులో బొత్స ఝాన్సీ ప్రచారం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి 37వ వార్డులో దక్షిణ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్‌కుమార్‌తో కలిసి విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జగన్ ఫ్యాన్ గాలికి టిడిపి, జనసేన, బిజెపి కూటమి చెదరక తప్పదన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ, ఈ ప్రాంత మత్స్యకారుల బోట్లకు జరిగిన అగ్ని ప్రమాదంలో మంటలు ఆరకముందే అధిక మొత్తంలో నష్టపరిహారం ఇచ్చిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. కార్పొరేటర్ చెన్నా జానకిరామ్ ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమంలో కుంచుమాంబ గుడి, పెయిన్‌దొరపేట, గాంధీ బొమ్మ, దిగువ రెల్లివీధి, జబ్బర్ తోట, కొత్తఅగ్రహారం కాలనీ, బీచ్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, దక్షిణ నియోజకవర్గం ఎన్నికల పరిశీలకుడు ద్రోణంరాజు శ్రీవాత్సవ్, రెల్లి కార్పొరేషన్ ఛైర్మన్ వడ్డాది మధుసూదనరావు, 37వ వార్డు సీనియర్ నాయకులు గనగల్ల రామరాజు, అశోక్, వెంకటలక్ష్మి, పులి రాజు తదితరులు పాల్గొన్నారు.

62వ వార్డులో 'ఆడారి' ప్రచారం

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 62వ వార్డు పరిధి గుడివాడ అప్పన్నకాలనీలో కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యాన పశ్చిమ నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా స్థానికంగా ఉన్న ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా ఆనంద్ కుమార్‌కు కార్యకర్తలు, అభిమానులు గజమాలతో సత్కరించి స్వాగతం పలికారు. జనం నుంచి విశేష ఆదరణ లభించింది. ప్రచారంలో భాగంగా ప్రతి ఇంటికీ వెళ్లి సమస్యలనడిగి తెలుసుకున్నారు. పరిష్కారానికి హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో చేసిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని ప్రజలను కోరారు. జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుండపు నాగేశ్వరరావు, ట్రేడ్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కలిదిండి బద్రీనాథ్, బీశెట్టి గణేష్, నరేష్, సోమాదుల సురేష్, నియోజకవర్గ పరిధిలోని కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఆడారి ఆనంద్‌కుమార్

ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్న బిజెపి ఎంపీ అభ్యర్థి

సిఎం.రమేష్‌పై చర్యలు తీసుకోవాలి

సిపిఎం నేతలు శంకరరావు, శ్రీరామ్, తేలయ్యబాబు

విలేకర్ల సమావేశంలో పాల్గొన్న శంకరరావు, శ్రీరామ్, తేలయ్యబాబు

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గం బిజెపి అభ్యర్థి సీఎం.రమేష్ ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తున్న నేపథ్యంలో ఆయనపై ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు స్థానిక సిపిఎం కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకర్ల సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఆర్.శంకరరావు, అనకాపల్లి మండలం కన్వీనర్ గంటా శ్రీరామ్, నాయకులు కాళ్ళ తేలయ్యబాబు మాట్లాడారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో కొన్ని షాపులకు వ్యాపారం పేరుతో అక్రమంగా డబ్బులను పంపించి, వారి నుండి డబ్బును ఓటర్లకు పంపిణీ చేయడానికి ప్రయత్నం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 3న ఎటువంటి అనుమతులు తీసుకోకుండా సుమారు 40 వాహనాలతో అనకాపల్లి బైపాస్ నుండి నెహ్రూ చౌక్ జంక్షన్ వరకు, ఇక్కడ నుండి మళ్లీ బైపాస్ వరకు ప్రదర్శన చేశారని పేర్కొన్నారు. దీనికి ముందు స్థానిక రింగు రోడ్డులోని తెలుగుదేశం పార్టీ నాయకులకు చెందిన ప్రైవేటు స్థలంలో వాహనాలను ఉంచారని చెప్పారు. పెద్ద పెద్ద బ్యానర్లను వ్యాన్లు, ఆటోల ద్వారా ప్రదర్శించారని తెలిపారు. ఎన్నికలు నిబంధనలు ప్రకారం 24 చదరపు అడుగుల బ్యానర్ మాత్రమే ఒక వాహనానికి ఉపయోగించాలన్నారు. కానీ దానికి మించిన సైజుతో కూడిన బ్యానర్లను వాహనం చుట్టూ ఉపయోగిస్తూ పెద్ద పెద్ద స్కీన్‌లను ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఇలా అడుగడుగునా బిజెపి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఎన్నికల నిబంధనలను ఉల్లఘించారని, ఈ నేపథ్యంలో తక్షణమే ఆయనపై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు సిపిఎం నాయకులు విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న సిఐ వినోద్ బాబు

ఎన్నికల నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి- కశింకోట

ఎన్నికల నిబంధనలను అందరూ పాటించాలని కసింకోట సిఐ వినోద్‌బాబు అన్నారు. మండలంలోని అచ్చర్ల గ్రామంలో గ్రామస్తులతో ఎన్నికలపై అవగాహన సమావేశం శుక్రవారం రాత్రి నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టం పరమైన చర్యలు చేపడతామన్నారు. ఎన్నికల్లో ఎటువంటి గొడవలు పడకుండా యువత ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో ఎస్ఐ రమేష్ బాబు, సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైసిపి అభ్యర్థి భరత్ కుమార్ ప్రచారం

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలోని తుమ్మపాల కొత్తపేట వీధి ప్రాంతంలో వైసిపి అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులను, ప్రజలను భరత్ కలిసి స్థానిక సమస్యలపై చర్చించారు. ముందుగా పోతులూరి వీర బ్రహ్మేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే తిరిగి వైసీపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దంతులూరి దిలీప్ కుమార్, సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు, అన్నపూర్ణ బ్యాంక్ మాజీ చైర్మన్ పిడి గాంధీ, సీనియర్ నాయకులు పడాల గణపతి రావు, వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సభలో మాట్లాడుతున్న కూటమి అభ్యర్థి పైలా ప్రసాదరావు

పైలా ప్రసాదరావు ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- కె.కోటపాడు : టిడిపి, బిజెపి, జనసేన కూటమి మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గ అభ్యర్థి పైలా ప్రసాదరావు శుక్రవారం మండలంలోని చౌడువాడ గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు సిఎం కాగానే 50ఏళ్ళు నిండిన బీసీలకు పెన్షన్ ఇవ్వనున్నట్లు తెలిపారు. సైకిల్ గుర్తుపై తనకు, కమలం గుర్తుపై సిఎం.రమేష్‌కు ఓట్లు వేసి ఎమ్మెల్యే, ఎంపీలుగా గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీ అభ్యర్థి రమేష్ సోదరుడు సిఎం.సురేష్ మాట్లాడుతూ అధికారంలోకి రాగానే యువతకు ఉద్యోగం, మహిళలకు అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో జనసేన పార్టీ మాడుగుల నియోజకవర్గం ఇంచార్జి రాయపురెడ్డి కృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు రొంగలి మహేష్, చౌడువాడ సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, బీజేపీ మండల అధ్యక్షులు కొట్టన ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక జాతర

ప్రజాశక్తి-అనకాపల్లి : శ్రీనూకంబిక అమ్మవారి మాలధారాల సంఘం వ్యవస్థాపకులు పొలిమేర శ్రీను ఆధ్వర్యంలో శుక్రవారం కొత్త అమావాస్య జాతర ఘనంగా నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని రథంపై ఉంచి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. మాల ధరించిన భక్తులు అమ్మవారి ఘటాలు, శోలాలు, అమ్మవారి అలంకరణలతో చేసిన నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా భారీ అన్న సమరాధన నిర్వహించారు. నూకాంబిక అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ఆలయ సహాయ కమిషనర్ బండారి ప్రసాద్, జిల్లా ఖోఖో సంఘం అధ్యక్షులు దాడి జైవీర్ ప్రత్యేక పూజలు చేసి ఊరేగింపును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

వీరాంజనేయస్వామి ఆలయ పునర్నిర్మాణానికి భూమి పూజ

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని మొగలిపురం గ్రామంలో వీరాంజనేయ స్వామి ఆలయ పునర్నిర్మాణానికి శుక్రవారం ఆలయ ఉత్సవ కమిటీ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో భూమి పూజ నిర్వహించారు. అనకాపల్లి పార్లమెంట్ వైసిపి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, పెందుర్తి నియోజకవర్గం వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్ రాజ్ ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బోకం సూర్యకుమారి, రామునాయుడు, వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, అంతకాపల్లి సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైసిపి సీనియర్ గండి రవికుమార్, ఐడి బాబు, యడ్ల నాయుడు, మల్లునాయుడుపాలెం సర్పంచ్ బోను నాయుడు, మేడపురెడ్డి జగన్నాథం, అంగటి సూర్య నారాయణ, గోపి అక్కునాయుడు పాల్గొన్నారు.

జగన్ పాలనలో రాష్ట్రం సర్వ నాశనం

మాట్లాడుతున్న కొణతాల రామకృష్ణ

ప్రజాశక్తి-అనకాపల్లి

వైఎస్.జగన్మోహన్‌రెడ్డి పాలనలో ఇప్పటికే రాష్ట్రంలోని అన్ని రంగాలు సర్వనాశనమయ్యాయని టిడిపి, జనసేన, బిజెపి కూటమి అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి కొణతాల రామకృష్ణ ఆరోపించారు. పట్టణంలోని పాత 18, 19, 27 వార్డుల తెలుగుదేశం, జనసేన బిజెపి కార్యకర్తల సమావేశం దిబ్బవీధి కళ్యాణమండపంలో శుక్రవారం జరిగింది. ఇందులో పాల్గొన్న కొణతాల రామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆయా పార్టీల నాయకులు బుద్ధ నాగ జగదీశ్వరరావు, డాక్టర్ కెకెవిఎ.నారాయణరావు, మల్ల సురేంద్ర, రుత్విక్, మల్ల గణేష్ పెతకంశెట్టి వెంకటరావు, మల్ల రామకృష్ణ, సాలాపు నాయుడు, పేల శ్రీనివాసరావు, కొణతాల బాల, కొణతాల అప్పలరాజు, విల్లూరి హరి తదితరులు పాల్గొన్నారు.

80వ వార్డులో ప్రచారం

జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి బొడ్డేడ మురళి ఆధ్వర్యంలో జీవీఎంసీ 80వ వార్డు (పాత 23వ వార్డు)లో పరిధిలోని పల్లప వీధి, బంగ్లా రోడ్డు, దాడి వారి వీధి, దాసరిగెడ్డ రోడ్డు తదితర ప్రాంతాల్లో శుక్రవారం ప్రచారం చేశారు. ఎమ్మెల్యేగా కొణతాల రామకృష్ణను, ఎంపీగా సీఎం రమేష్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టిడిపి, బిజెపి, జనసేన నాయకులు బిఎస్ఎంకె జోగినాయుడు, రిత్విక్, మళ్ళ శ్రీను, మారిశెట్టి భాస్కరరావు, కర్రి సన్యాసినాయుడు, బుద్ధ ఈశ్వరరావు, కోరిబిల్లి పరి, సూరిశెట్టి రాముడు, పిళ్ళా కొండయ్య నాయుడు, ఆళ్ల వెంకట్, సూరిశెట్టి స్వర్ణ శ్రీను, పలువురు నాయకులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థులను గెలిపించాలి

కశింకోట : టిడిపి, బిజెపి, జనసేన కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ రాష్ట్ర తెలుగు రైతు కార్యదర్శి గొంతుని శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. మండలంలో పల్లపు సోమవారంలో శుక్రవారం బూత్ కమిటీ సభ్యులతో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చెందాలంటే టీడీపీ రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నారిపిల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైసిపి నాయకులను కలిసిన విజయకుమార్

ప్రజాశక్తి-అచ్యుతాపురం

టిడిపి, బిజెపి, జనసేన కూటమి తరుపున ఎలమంచిలి నియోజకవర్గం నుండి జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్న సుందరపు విజయ్ కుమార్ నియోజకవర్గంలోని వైసిపి నాయకులను కలిశారు. ఇందులో భాగంగా డిఎస్ఎన్ రాజును ఆయన స్వగృహంలో శుక్రవారం కలిసి ఎన్నికలలో తనకు మద్దతు తెలపాలని కోరారు. రెండు మూడు రోజుల్లో తన నిర్ణయం తెలుపుతానని రాజు చెప్పినట్లు తెలిసింది. డిఎస్ఎన్.రాజు వైసిపిలో ఎమ్మెల్యే కన్నబాబురాజుతో కలిసి పనిచేస్తున్నారు. విజయ్‌కుమార్ వెంట జెడ్పీటిసి మాజీ సభ్యుడు జనపరెడ్డి శ్రీనివాసరావు ఉన్నారు. కాగా మల్లవరం గ్రామానికి చెందిన చల్లా సరిబాబు జనసేనలో చేరారు. ఆయనకు సుందరపు విజయ్ కుమార్ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ద్వారపురెడ్డి బాబ్జి పాల్గొన్నారు.


డిఎస్ఎన్.రాజును కలిసిన విజయ్‌కుమార్

వైద్యం నిమిత్తం ఆర్థిక సహాయం

ప్రజాశక్తి-అచ్యుతాపురం : మండలంలోని వాడనరసాపురం గ్రామానికి చెందిన ధోళిపిల్లి కొండమ్మ ఇంటి దగ్గర ప్రమాదవశాత్తు మెట్ల పైనుంచి జారీ పడడంతో ఆమె కుడికాలు ఎముక దెబ్బతింది. ఆమె ఆర్థిక పరిస్థితి బాగో లేకపోవడంతో శ్రీస్వామి వివేకానంద వికలాంగుల చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు మెరుగు నూకరాజు ఆధ్వర్యంలో ఆమెకు వైద్యం నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఆమె నడవడానికి వీలుగా వాకర్ అందించారు. ఈ కార్యక్రమంలో జి రాము తదితరులు పాల్గొన్నారు.

టిడిపి మాజీ సర్పంచ్ వైసిపిలో చేరిక

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి మండలం, సత్యనారాయణపురం మాజీ సర్పంచ్, టిడిపి నేత ఉప్పిలి సత్యనారాయణ తన అనుచరులతో కలిసి అనకాపల్లి నియోజవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్ సతీమణి నివేదిత సమక్షంలో శుక్రవారం వైసిపిలో చేరారు. వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో గంగుపాము నాగేశ్వరరావు, గ్రామ సర్పంచ్ పలక భాగ్యలక్ష్మి సత్తిబాబు, ఎంపీటీసీలు నాగమణి నాగేశ్వరరావు, కెఎల్ఎం.నాయుడు, నాయకులు సిహెచ్.ఈశ్వరరావు, పల్లా ముత్యాలు, పి.సుశీల, రవి కిషోర్, రాజశేఖర్, అప్పలరాజు, తాతబాబు, పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా దుర్గాలమ్మ ఆలయ ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని వెన్నెలపాలెం పంచాయితీలో శ్రీదుర్గ మాంబ అమ్మవారి ఆలయం ప్రారంభోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ హాజరై అమ్మవారిని దర్శించుకొని, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. గ్రామానికి విచ్చేసిన సందర్భంగా వెన్నెలపాలెం సర్పంచ్ వెన్నెల అప్పారావు, మండల జెసిఎస్ కన్వీనర్ వెన్నెల సన్యాసిరావు ఆయనకు స్వాగతం పలికి, సాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ మాట్లాడుతూ ఆలయం ప్రారంభోత్సవానికి ఆహ్వానించి, అమ్మవారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకట పద్మ లక్ష్మి, వైసిపి రాష్ట్ర సిఇసి సభ్యులు పైలా శ్రీనివాసరావు, ఆర్ఇసిఇఎస్ మాజీ చైర్మన్ చల్ల కనకారావు, వైసిపి నాయకులు గండి రవికుమార్, వెన్నెల సింహాద్రి, పైల సత్యనారాయణ, నాయుడుపాలెం సర్పంచ్ బోని నాయుడు, ఎడ్ల నాయుడు, దాడి ఉమా, మాసవరపు ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాన్ని ప్రారంభిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంతి

భీమిలి టిడిపి కార్యాలయంలో నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి -యంత్రాంగం

మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం పలుచోట్ల ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భీమునిపట్నం : స్థానిక టిడిపి కార్యాలయంలో బాబూ జగజ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ ఎస్సీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు పతివాడ రాంబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు డిఎఎన్.రాజు, ఎం.సంజీవ్‌కుమార్, కొక్కిరి అప్పన్న, జి.పోలిరాజు తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : బాలయ్యశాస్త్రి లే-అవుట్‌లోని ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో బాబూజగ్జీవన్‌రామ్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కెకె.రాజు, ఉత్తర నియోజకవర్గం ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకర్రావు, కార్పొరేటర్లు కంటిపాము కామేశ్వరి, కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, ఉషశ్రీ, వావిలపల్లి ప్రసాద్, రేయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కెవిఎన్.శశికళ పాల్గొన్నారు.

ములగాడ : పశ్చిమ నియోజకవర్గంలోని ప్రకాష్‌నగర్, మల్కాపురం గ్రామ మండలి కాకరలోయ గ్రామాలలో బాబూ జగ్జీవన్‌రామ్‌కు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు అత్తిలి విమల నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల సత్య ఆంజనేయ, గుడాల రాంబాబు, నూనెల సూరిబాబు, గుడాల జయ పుష్ప, నూకరాజు, ఎల్లాజీ, అప్పలస్వామి, కనకరాజు కూరాకుల శంకర్రావు, వర్మ, జి.రామకృష్ణ పాల్గొన్నారు.

విశాఖపట్నం: ఆంధ్రవిశ్వవిద్యాలయంలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఏయూ అధికారులు పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో వీసీ ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్‌స్టీఫెన్, ఒఎస్‌డి వి.కృష్ణమోహన్, ఆచార్య కె.దుర్గాకుమారి, ప్రిన్సిపల్స్ ఆచార్య ఎ.నరసింహారావు, జి.శశిభూషణరావు, వి.విజయలక్ష్మి, ఆచార్య టి.షారోన్‌రాజు, కె.బసవయ్య, ఎంవిఆర్.రాజు, పి.ప్రేమానందం, పి.వెంకటేశ్వర్లు, చిట్టిబాబు, డిఎ.నాయుడు, జి.వీర్రాజు, ఆచార్యులు, అధికారులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం : ఉక్కునగరంలోని జగ్జీవన్‌రామ్ పార్కులో ఉన్న విగ్రహానికి ఉక్కు జనరల్ మేనేజర్ (మిల్స్) డాక్టర్ ఎంఎస్.ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాబూజగ్జీవన్‌రామ్ సంక్షిప్త జీవిత చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. విఎస్‌పి ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం సంఘం అధ్యక్షుడు బోండా తవుడన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, అధికారులు టికెఎస్‌ఆర్ ఠాగూర్, ప్రసాద్, కార్మిక సంఘాల నాయకులు వై.మస్తానప్ప, కడిమి రాజబాబు, జి.ఆనంద్, కారు రమణ, డి.సంపూర్ణం, రవికుమార్, యు.దానమయ్య, నతానియెల్, దాసరి పుల్లారావు పాల్గొన్నారు.

చీడికాడ ఎంపిడిఒ కార్యాలయంలో...

మధురవాడ : ఎండాడలోని వైసిపి కార్యాలయంలో బాబూ జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు పూలమాల వేసి నివాళులర్పించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో బోని శివరామకృష్ణ, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, రవిరెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం : అంబేద్కర్ భవనంలో బాబూ జగ్జీవన్‌రామ్ జయంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు హాజరై జగజ్జీవన్‌రామ్ చేసిన సేవలను కొనియాడారు. బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి అన్నారు. ఈ కార్యక్రమంలో. అడ్వకేట్ పెద్దాడ వెంకటచలపతి, కొప్పల వెంకటరావు, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ అధ్యక్షులు బొడ్డు కల్యాణరావు, కార్యదర్శి జెవి.ప్రభాకర్, కోశాధికారి జి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం మండలంలో...

మాధవధార : విశాఖ నగరంలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహానికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ ఓబీసీ డిపార్ట్‌మెంట్ చైర్మన్ మూల వెంకటరావు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఆనందపురం : ఆనందపురం మండలం వేములవలస పంచాయతీ ఎస్‌సి కాలనీలో బాబూ జగజ్జీవన్‌రామ్ విగ్రహానికి ఉత్తరాంధ్ర దళిత నాయకులు భాగం గోపాలరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక దళిత సంఘాల నాయకులు, ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కమిషనర్ సాయికాంత్ వర్మ బాబూ జగ్జీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. కార్యక్రమంలో జివిఎంసి అదనపు కమిషనర్ కెఎస్.విశ్వనాథన్, అదనపు కమిషనర్లు డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, ఎస్ఎస్.వర్మ, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ ఇ.వాసుదేవరెడ్డి, సెక్రటరీ పి.నల్లనయ్య, యుసిడి పీడీ కెవి.పాపునాయుడు పాల్గొన్నారు. పోలీస్ కమిషనర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సిపి డాక్టర్ ఎ.రవిశంకర్ పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : టిడిపి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ విశాఖ పార్లమెంట్ అభ్యర్థి ఎం.శ్రీ భరత్, పార్టీ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జీ, పొలమరశెట్టి శ్రీనివాసరావు, బుడుమూరి గోవిందు, పి.జయరాజ్ (జాన్), ఈతలపాక సుజాత పాల్గొన్నారు. 35వ వార్డులో జరిగిన కార్యక్రమంలో ఆ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సీతంరాజు సుధాకర్, 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు పాల్గొన్నారు.



శ్రద్ధాంజలి ఘటిస్తున్న అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి

చీడికాడ : బాబూ జగ్జీవన్‌రామ్ 117వ జయంతిని పురస్కరించుకుని మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎంపిడిఒ ఉమామహేశ్వరి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జైతవరం గ్రామ సచివాలయంలోనూ జగ్జీవన్‌రామ్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోపి, నవీన్, విఆర్‌ఒ గౌరీశంకర్, మహిళా పోలీస్ సుధారాణి, వెటర్నరీ అసిస్టెంట్ ఎం శ్రీనివాసరావు పాల్గొన్నారు

రోలుగుంట : మండల కేంద్రమైన రోలుగుంటలో శుక్రవారం బాబు జగ్జీవన్ రామ్ 117వ జయంతిని ఎంఆర్‌పిఎస్ సంయుక్త కార్యదర్శి పులగుజ్జుల వెంకటలక్ష్మీ రమణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జగ్జీవన్ రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ మండల అధ్యక్షులు పులగుజ్జుల శివ, చెవ్వేటి కొండబాబు, దేవుడు, అప్పారావు, అర్జున పాల్గొన్నారు.

గొలుగొండ : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బాబు జగ్గీవన్‌రామ్ జయంతిని సందర్భంగా ఆయన చిత్రపటానికి తహశీల్దార్ ప్రభాకర్ రాజు పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. డిటీ భరత్, విఆర్‌ఒలు, విఆర్‌ఎలు పాల్గొన్నారు.

మేజర్ పంచాయతీ ఎఎల్.పురంలో..

మండలంలోని మేజర్ పంచాయతీ ఏఎల్ పురం గ్రామంలో బాబూ జగజ్జీవన్ రామ్ విగ్రహానికి మాజీ జెడ్పిటిసి చిటికీల తారక వేణుగోపాల్, నర్సీపట్నం మార్కెట్ కమిటీ చైర్మన్ చిటికెల భాస్కర్‌నాయుడు, అనకాపల్లి జిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షురాలు మేజర్ పంచాయతీ ఎఎల్ పురం సర్పంచ్ లోచల సుజాత పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాబు జగ్జీవన్ రామ్ దేశానికి చేసిన సేవలను గుర్తు చేశారు. బాబూజీ అడుగుజాడల్లో అందరూ నడవాలని ఆకాంక్షించారు కార్యక్రమంలో గజ్జలపు సత్యనారాయణ కుందూరు శివ కుందూరు అప్పారావు జగజ్జీవన్ రామ్ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

నక్కపల్లి :మండలంలోని పలు గ్రామాల్లో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. నక్కపల్లి ఎస్‌సి కాలనీలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పలు రాజకీయ పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు .

చోడవరంలో..

సబ్బవరం : మండలంలోని అమరపినివాని పాలెం, అంతకాపల్లి గ్రామాల్లో జగ్జీవన్ రామ్ విగ్రహాలకు ఎంఆర్‌పిఎస్ నాయకులు గొటివాడ సామ్రాట్ కుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇండుగుబిల్లి దేముడుబాబు, పెదగొల్లల పాలెం ఉప సర్పంచ్ వర్మ, మాజీ సర్పంచ్ కొమ్ము కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

కశింకోట : కశింకోట పంచాయతీ కార్యాలయంలో జగ్గీవన్‌రామ్ జయంతి వేడుకలు సచివాలయ సిబ్బంది ఘనంగా నిర్వహించారు. స్వీట్లు పంచిపెట్టారు. కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ ఎన్ రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని తెనుగుపూడి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలుర గురుకుల పాఠశాలలో జగ్గీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నాగరాజు, నాగేశ్వరరావు, ధనుంజయ్ పాల్గొన్నారు.

చోడవరం : పట్టణంలో ఇందిరా కాలనీలో చిన్నం నాగరాజు ఆధ్వర్యాన జగ్గీవన్ రామ్ చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు మూర్తా శ్రీనివాసరావు, ఖండేలా వెంకట్రావు, అత్తోట వజ్రభూషనం, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి కలెక్టర్, ఎస్‌పి కార్యాలయాల్లో...

అనకాపల్లి : స్వాతంత్ర్య సమరయోధుడు సమతావాది బాబు జగ్గీవన్ రామ్ దేశం గర్వించదగ్గ వ్యక్తి అని జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టి కొనియాడారు. జగ్గీవన్ రామ్ 117వ జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి జ్యోతి వెలిగించి పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో డిఆర్‌ఒ బి.దయానిధి, సాంఘిక సంక్షేమ శాఖ ఏడి అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం జగ్గీవన్‌రామ్ చిత్రపటానికి అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించినారు. కార్యక్రమంలో ఎస్‌బి డీఎస్పీ బి.అప్పారావు, ఇన్‌స్పెక్టర్ అప్పలనాయుడు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యాన

అనకాపల్లి గవరపాలెం అరుంధతి నగర్‌లో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్ కుమార్, అనకాపల్లి ఎంపీ డాక్టర్ భీశెట్టి సత్యవతి జగ్గీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తుమ్మపాల ఇందిరా నగర్‌లో జగ్గీవన్ రామ్ జయంతి కార్యక్రమంలో మలసాల భరత్ కుమార్, దంతులూరి దిలీప్ కుమార్ పాల్గొన్నారు. అనకాపల్లిలోని జగ్గీవన్ రామ్ విగ్రహానికి టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ధ నాగ జగదీశ్వరరావు నివాళులర్పించారు. కూటమి కొణతాల రామకష్ణ జగ్గీవన్ రామ్ చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. తుమ్మపాల ఇందిరానగర్ కాలనీలో కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి ఐఆర్ గంగాధర్ ఆధ్వర్యంలో జగ్గీవన్ రామ్‌కు నివాళులర్పించారు. డైట్ కళాశాలలో కరస్పాండెంట్ దాడి రత్నాకర్ ఆధ్వర్యంలో జగ్గీవన్ రామ్ జయంతి నిర్వహించారు.

మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు

గొలుగొండ మండలం ఎఎల్.పురంలో...

అనకాపల్లిలో మాట్లాడుతున్న వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్

మద్యం ప్రియులకు షాక్!

మద్యం దుకాణం వద్ద కొనుగోలుకు ఎగబడుతున్న మందు ప్రియులు

- అమ్మకాలపై ఎన్నికల సంఘం ఆంక్షలు
- రూ.మూడు లక్షలకు మించి చేపట్టరాదని ఆదేశం
- ఇదే అదునుగా భారీగా మద్యం పక్కదారి
- అధిక ధరలకు బ్లాక్‌లో విక్రయాలు : పట్టని అధికారులు

ప్రజాశక్తి -కోటవురట్ల : సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించిన ఎన్నికలసంఘం, శాంతియుత ఎన్నికల నిర్వహణకు చేపట్టే చర్యల్లో భాగంగా మద్యం అమ్మకాలపై పరిమితులను విధిస్తూ ఆంక్షలు జారీ చేసింది. ఈ లెక్కన ఒక్కో మద్యం షాపులో రూ.మూడు లక్షలకు మించి మద్యం అమ్మకాలు చేపట్టరాదంటూ ఎన్నికల కమిషన్ నిబంధనలు జారీ చేసింది. ఒక్కొక్కరికి ఒక్కో బాటిల్ మాత్రమే అమ్మాలని ఎన్నికల సంఘం నుంచి ఆదేశాలు వచ్చాయని, దానికి అనుగుణంగా అమ్మకాలను చేపడుతున్నట్లు మద్యం నిర్వాహకులు చెబుతున్నారు, ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ఇది మంచి నిర్ణయమే అయినప్పటికీ, మద్యం ప్రియులకు షాక్‌యేనని పలువురు అభిప్రాయ పడుతున్నారు. దీన్ని ఆసరాగా చేసుకుని మద్యానికి అనూహ్యం డిమాండ్ పెరగడం, ఇదే అదునుగా మద్యం పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి,

వాస్తవానికి మద్యం ప్రియులు సాయంత్రం సమయంలో అత్యధికంగా కొనుగోలు చేసేందుకు వస్తూ ఉంటారు, ఆ సమయానికి మద్యం షాపుల వద్ద ఎన్నికల సంఘం పెట్టిన నిబంధనల మేరకు అమ్మకాలు పూర్తవ్వడంతో అప్పుడొచ్చే మద్యం ప్రియులు గగ్గోలు పెడుతున్నారు, ఇచ్చిన టార్గెట్ పూర్తి కావడంతో మద్యం అమ్మకాలు నిలిపిస్తున్నామని దుకాణదారులు చెబుతుండడంతో, వారిపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, అయితే ఉదయం నుండి సాయంత్రం సమయానికే ఎక్కువమంది కొనుగోలు చేసి బ్లాక్‌లో అమ్మకాలు చేపడుతున్నారని ఒక్కో బాటిల్‌కు రూ.50 వరకు అదనంగా వేసి అమ్మకాలు చేస్తున్నారనే ఆరోపణలూ వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం కూడా మద్యం అమ్మకాలలో అక్రమాలకు తెరదీసినట్లు అవుతోందని మందుబాబులు మండిపడుతున్నారు,

గడిచిన వారం రోజులుగా ఇదే పరిస్థితి కొనసాగుతోందని, బ్లాక్‌లో దొరుకుతున్న మద్యం, ప్రభుత్వ దుకాణంలో ఎందుకు అందుబాటులో లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే మద్యం ధరలను విపరీతంగా పెంచేసి, కొన్నేళ్లుగా ప్రభుత్వం మందుబాబుల ఇళ్లు, జేబులను ఎపుడో గుల్ల చేయగా, తాజాగా ఎన్నికల సంఘం నిర్ణయంతో మద్యానికి అవాంఛిత డిమాండ్ ఏర్పడి, బ్లాక్‌లో కొనుక్కోవాల్సిన పరిస్థితుల్లో మందుబాబులు లబోదిబోమంటున్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు మద్యం అమ్మకాలపై ప్రభుత్వ అధికారులు దృష్టిపెట్టి, మద్యం బాటిళ్లు పక్కదోవ పట్టకుండా, నిర్ధేశించిన ధరకే మద్యం ప్రియులకు విక్రయించేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

750 కిలోల రేషన్ బియ్యం పట్టివేత

రేషన్ డీలర్ సస్పెన్షన్ : '6ఎ' కేసు నమోదు

ఆటోలో తరలిస్తూ పట్టుబడిన రేషన్ బియ్యం

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని లింగంపేటలో రేషన్ బియ్యాన్ని ఆటోలో తరలిస్తుండగా గ్రామస్థులు పట్టుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని లింగంపేటలో 22వ రేషన్ డిపో నుంచి రేషన్ బియ్యాన్ని ఆటోలో నర్సీపట్నం తరలిస్తుండగా గ్రామస్థులు గురువారం రాత్రి పట్టుకొని పోలీసులకు, తహశీల్దార్‌కు సమాచారం ఇచ్చారు. రేషన్ డీలర్ ఎం.స్వామినాయుడు, ఇంటింటికీ రేషన్ పంపిణీ చేసే వాహనదారుడు కుమ్మక్కైచ 15 బస్తాల్లో 750 కిలోల బియ్యాన్ని తరలిస్తున్నారు. రేషన్ బియ్యాన్ని పట్టుకుని అధికారులకు అప్పగించడంతో ఈ మేరకు తగు చర్యలు చేపట్టారు.

రేషన్ డీలర్ సస్పెన్షన్

గురువారం రాత్రి రేషన్ బియ్యం పట్టివేత ఘటనపై స్థానిక తహశీల్దార్ ప్రభాకర్ రాజును వివరణ కోరగా డీలర్ ఎం.స్వామినాయుడుపై 6ఎ కేసు నమోదు చేసి సస్పెండ్ చేశామన్నారు. కాగా శుక్రవారం సిఎస్‌డిటి రేఖ చంద్రిక, ఆర్ఐ నాగరాజులు లింగంపేటలో విచారణ చేశారు డిపోలోని రిజిస్ట్రర్, స్టాక్‌ను తనిఖీ చేశారు. ఎండియు ఆపరేటర్ కొత్తం ప్రసాద్‌ను కూడా విచారణ చేశారు. అనంతరం కేడిపేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి రాత్రి పట్టుబడ్డ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని నర్సీపట్నం సివిల్ సప్లై గొడౌన్‌కు తరలించారు. విచారణ అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని డిటి తెలిపారు.

మారుమూల గిరిజన గ్రామాల్లో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయండి

ప్రజాశక్తి- ముంచంగిపుట్టు: మండలంలోని అతి మారుమూల బుంగాపుట్టు పంచాయతీ కేంద్రంతోపాటు కోసంపుట్టు గ్రామంలో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆయా పంచాయతీల గిరిజనులు నిరసన వ్యక్తం చేశారు. ఓటున్న ప్రతిఒక్కరూ దాన్ని వినియోగించుకోవాలంటే అందుబాటులో పోలింగ్ బూత్ ఏర్పాటు చేయాలని నినాదాలు చేశారు. శుక్రవారం ఆయా పంచాయతీల గిరిజనులు ప్రత్యేక సమావేశమై ఈ మేరకు ప్రభుత్వానికి, ఎన్నికల సంఘానికి డిమాండ్ చేశారు.

.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ అల్లంగి.కోము, లైచోన్ మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన ఎన్నికల్లో బాబుశాల పోలింగ్ కేంద్రానికి కాలినడకన వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన పరిస్థితుల్లో ఆసక్తి ఉన్నా అనేక మంది ఓటుకు దూరమయ్యారని, దీంతో పోలింగ్‌శాతం తగ్గిందన్నారు. ఏదైనా వాహనంలో వెళ్లి ఓటేద్దామనుకున్నా రోడ్డు సౌకర్యం లేదని, దీంతో ప్రజాస్వామ్యం కల్పించిన ఓటు హక్కును తమలో మెజార్టీ మంది వేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.

అప్పట్లో రోడ్డు సౌకర్యం లేనందువల్ల పోలింగ్‌బూత్ ఏర్పాటు చేయలేకపోతున్నామని చెప్పి దాటేసిన అధికారులు, ఇపుడు తమ గ్రామాల్లో అవసరమైన భవనాలు, పోలింగ్ సిబ్బంది వచ్చేందుకు బుంగాపుట్టు, కోసంపుట్టు వరకు రోడ్డు సౌకర్యం ఉన్న నేపథ్యంలో పోలింగ్‌బూత్ ఏర్పాటుపై దృష్టి పెట్టాలని కోరారు. అన్నిసౌకర్యాలు బాగానే ఉన్నాప్పటికీ నెల రోజుల క్రితమే లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలోని పోలింగ్‌బూత్‌కు మార్పు చేయడంతో అక్కడి ఓటర్లు ఇబ్బందులకు గురై, ఓటుకు దూరమయ్యే పరిస్థితి నెలకొందన్నారు. ఇప్పటికైనా ఎన్నికల సంఘం, సంబంధిత అధికారులు సంప్రదించి, కనీసం పంచాయతీ కేంద్రాల వారీగానైనా పోలింగ్ బూత్‌లు ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని, ఇతర పంచాయతీ కేంద్రాల్లో ఏర్పాటు చేసే బూత్‌లకు వెళ్లి ఓటేయమనడం సమంజసం కాదని అంటున్నారు. గిరిజనులు పూర్తిస్థాయిలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలంటే, పోలింగ్ కేంద్రాలను చేరువ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సువాబి మంగ్లన , ఆల్లంగి నింధి, ఎ.నొందో, సోనియా, అద్దు, కె.డుంబ్రు, ఎ.సుక్కు, ఎ.భగవాన్ పాల్గొన్నారు.

జాబ్ కార్డు లేక 'ఉపాధి' కరువు!

- సాంకేతిక కారణాలతో రద్దయిన వాటిని పునరుద్ధరించాలి
- ఉన్న కార్డుల్లో కుటుంబసభ్యుల పేర్లను చేర్చాలి
- రావికమతం, చినపాచుల, కొమిర, కవగుంట గ్రామాల కూలీలు వినతి

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ప్రజాశక్తి - రావికమతం :జాబ్ కార్డు లేకపోవడంతో ఉపాధి హామీ పథకం కింద పనులకు వెళ్లే అవకాశం లేకుండా పోయిందని పలువురు కూలీలు ఆవేదన చెందుతున్నారు. గత ఏడాది సాంకేతిక కారణాలతో కొన్ని జాబ్‌కార్డులు లేకుండా పోగా, వాటి స్థానంలో కొత్త జాబ్ కార్డులు ఇవ్వకపోవడంతో ఉపాధి కూలీలు నష్టపోతున్నామని వాపోతున్నారు. కోల్పోయిన జాబ్‌కార్డులు స్థానంలో కొత్తవి జారీకానీ, ఉన్న జాబ్‌కార్డుల్లో కొత్త పేర్లు నమోదుకు ఆస్కారం లేదని ఉపాధి సిబ్బంది తేల్చిచెప్పడంతో కూలీలు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాదికి ఇక ఉపాధి పథకానికి దూరమైనట్లేనని తల్లడిల్లుతున్నారు. ఎన్నికల పనుల్లో ఉన్నామని, కోడ్ అమలులో ఉందంటూ, కూలీలకు ఉపాధి కల్పనకు అధికారులు చర్యలు చేపట్టకపోవడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎన్నికలు ఉన్నాయని జాబ్‌కార్డులు ఇవ్వకపోతే, ప్రస్తుతం ఏప్రిల్, మే, జూన్ వరకు ఉపాధి పనులకు వెళ్లే అవకాశం లేకుంటే కుటుంబపోషణ ఎలాగని కూలీలు ఆవేదన చెందతున్నారు. పోయిన జాబ్ కార్డులు పునరుద్ధరించాలని, ఉన్న కార్డుల్లో వారి కుటుంబసభ్యుల పేర్లను కొత్తగా చేర్చాలని రావికమతం మండలంలోని రావికమతం, చినపాచుల, కొమిర, కవగుంట, గ్రామాలకు చెందిన కూలీలు పలువురు డిమాండ్ చేస్తున్నారు లేనిపోని నిబంధనలు పెట్టి, కూలీలకు ఉపాధిని దూరం చేయడం సరికాదన్నారు. కొత్త ప్రభుత్వం వచ్చేవరకు అంటూ కుంటిసాకులు మాని తక్షణ చర్యలు చేపట్టాలని కూలీలు కోరుతున్నారు.

కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అనిత ప్రచారం

ప్రజాశక్తి -నక్కపల్లి : మండలంలోని నక్కపల్లి, ఉపమాక గ్రామాల్లో టిడిపి, జనసేన, బిజెపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి వంగలపూడి అనిత శుక్రవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నక్కపల్లిలో టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్, ఉకమాకలో జిల్లా పరిషత్ కోఆప్షన్ మాజీ సభ్యులు కొప్పిశెట్టి కొండబాబు, బుజ్జి ఆధ్వర్యంలో టిడిపి శ్రేణులు ఆమెకు ఘన స్వాగతం పలికారు. ఉమ్మడి పార్టీలు అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టబోయే అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉమ్మడి పార్టీలనాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు .

అకౌంట్లకు జమ కాని సంక్షేమ నిధులు

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు
- విద్యాదీవెన ఫీజులను ముక్కుపిండి వసూలు చేస్తున్న కాలేజీ యాజమాన్యాలు
- నేటికీ పత్తాలేని చేయూత, ఆసరా సాయం

ప్రజాశక్తి - అనకాపల్లి డెస్క్: ప్రభుత్వం చేయూత, ఆసరా, విద్యాదీవెన వంటి పథకాలకు లబ్దిదారుల ఖాతాలకు సొమ్ములు విడుదల చేశామని ప్రకటించి నెలరోజులు గడుస్తున్నా నేటికీ లబ్ధిదారుల బ్యాంక్ అకౌంట్ కు జమ కాకపోవడంతో రావికమతం మండలంలో పలువురు లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి బటన్ నొక్కి నెలలు గడిచినా అకౌంట్‌లో డబ్బులు పడకపోగా, మరోవైపు విద్యార్థులు ఫీజులు కట్టుకోలేక పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలేజీ యాజమాన్యాలు మాత్రం వాటితో తమకు సంబంధం లేదని వ్యవహరిస్తూ, ప్రభుత్వం నుంచి విద్యాదీవెన డబ్బులు వస్తే తీసుకోవాలని, ఈలోగా తమకు ఫీజులు చెల్లించాలని ముక్కుపిండి మరీ వసూలు చేస్తున్నట్లు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు. ఇటువంటి మోసపూరిత వ్యవహారం మానుకొని డైరెక్టుగాలబ్ధిదారులకు ఇచ్చింది, ఇవ్వనిదీ తెలియపరిస్తే దానికి తగ్గ ప్రత్యామ్నాయం ఏర్పాట్లు తాము వెతుక్కుంటామని, కాలేజీలకు వెళ్లి యాజమాన్యాలను వేడుకోవడం, ప్రాధేయపడడం వంటి బాధలు తప్పేవని పలువురు లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మంజూరైన ప్రాప్తికి లబ్ధిదారుల ఖాతాల్లో సంక్షేమ నిధులను జమ చేసి తమ చిత్తశుద్ధిని ప్రభుత్వం నిరూపించుకోవాలని పలువురు బాహాటంగానే విమర్శిస్తున్నారు.

వారపుసంతలో పుచ్చకాయలకు గిరాకీ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: గిరి ప్రాంతంలోఎండల తీవ్రత నుంచి ఉపశమనం కోసం మండలంలోని గిరిజనులు మార్గాలు అన్వేషిస్తున్నారు. ఈక్రమంలో పుచ్చకాయలు, శీతలపానీయాలకు మంచి గిరాకీ పెరుగుతోంది. శుక్రవారం మండలంలోని అరకులోయ వారపుసంతలో గిరిజనులు పుచ్చకాయలను ఎగబడి కొనుగోలు చేయడంతో హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి.

తాతారావుకు స్వాగతం



బోని తాతారావును సత్కరిస్తున్న శంకర్, కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి -నక్కపల్లి : కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుని, ఎదురుచూస్తున్నారని పాయకరావుపేట నియోజకవర్గం కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బోని తాతారావు అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మేడేటి శంకర్ ఆధ్వర్యంలోఉపమాక వెంకన్నను, ఒడ్డిమెట్టలో గణపతిని దర్శించుకున్నారు.స్థానిక కాంగ్రెస్ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. పుష్ప గుచ్చాలు అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా తాతారావు మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్ర ప్రజలు పూర్తిగా విసిగిపోయారన్నారు. మరోవైపు బిజెపితో జతకట్టిన పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, ఈ నేపథ్యంలో అందరిచూపు కాంగ్రెస్ వైపే ఉందన్నారు. ఎపిసిసి అధ్యక్షురాలిగా షర్మిల బాధ్యతలు చేపట్టిన తర్వాత కాంగ్రెస్‌కు పునరుత్తేజం వచ్చిందని, వచ్చే ఎన్నికల్లో మంచి మెజార్టీతో విజయం ఖాయమన్నారు. కాంగ్రెస్ పార్టీ శ్రేణులంతా శక్తి వంచన లేకుండా పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు మీసాల సుబ్బన్న, ప్రగడ చక్రరావు, గుమ్మడి గోవిందు, సింహాద్రి పాల్గొన్నారు.

వైభవంగా నూకాలమ్మ ఆలయ ప్రతిష్ట

ప్రజాశక్తి- చీడికాడ : చీడికాడ మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన గ్రామ దేవత నూకాలమ్మ తల్లి ఆలయంలో శుక్రవారం విగ్రహ ప్రతిష్ట వైభవంగా జరిగింది. ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ, కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బొడ్డు శ్రీనివాస్, నాయకులు జానకిరామ్, కొరచా నారాయణమూర్తి, గండి ముసలి నాయుడు పరువాడ మహేష్ డోకల దాసు, ఎర్ర అప్పారావు, గణపతిరాజు రవిరాజు, మండల కొండబాబు ఇతర ప్రముఖులు, పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నూకాలమ్మ ఆలయం వద్ద భారీ అన్న సమారాధన జరిగింది. సాయంత్రం నాలుగు గంటలకు జిల్లాస్థాయి ఎడ్లబళ్ల పరుగు పందేలు నిర్వహించారు

మాడుగుల టిక్కెట్‌పై పునరాలోచించాలి

▶▶ నిరసన వ్యక్తం చేస్తున్న టిడిపి శ్రేణులు

చీడికాడలో నిరసన ప్రదర్శనలో టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి - చీడికాడ : మాడుగుల నియోజకవర్గ టిడిపి టిక్కెట్‌పై అధిష్టానం మరోసారి పునరాలోచించాలని, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడుకు కేటాయించాలని చీడికాడ మండల కేంద్రంలో తెలుగుదేశం శ్రేణులు నిరసన చేపట్టాయి. పెట్రోల్ బంకు నుండి చావడి సెంటర్ వరకు భారీర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాడుగుల టిడిపి టిక్కెట్‌ను అంతగా గుర్తింపు లేని నాయకుడికి కేటాయించారని, ప్రజల్లో పట్టున్న రామానాయుడుకు కేటాయించాలని డిమాండ్ చేశారు. 20 రోజులుగా నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో దీనిపై నిరసనలు చేపడుతున్నా అధిష్టానం పట్టించుకోకపోవడంపై నాయకులు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనలో నియోజకవర్గంలోని గల నాలుగు మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

పెందుర్తిలో జనసేనకు తప్పని తిప్పలు

అలక వీడని బండారు!



● ఎన్నికల ప్రచారానికి దూరంగా టిడిపి శ్రేణులు

ప్రజాశక్తి-సబ్బవరం : పెందుర్తి నియోజకవర్గం నుండి టిడిపి, జనసేన, బిజెపి కూటమి తరుపున పోటీ చేస్తున్న జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబుకు తిప్పలు తప్పేలా లేవు. టిడిపి సీనియర్ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి ఇక్కడి టికెట్ కేటాయించకపోవడంతో ఆయన అలక పూనారు. దీంతో ఈ నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారానికి టిడిపి శ్రేణులు దూరంగా ఉన్నాయి.

రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో టిడిపి, జనసేన, బిజెపి కూటమిగా ఏర్పడ్డాయి. పొత్తులో భాగంగా పెందుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్‌ను జనసేన పార్టీకి కేటాయించగా, ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబును అభ్యర్థిగా ప్రకటించారు. దీంతో 40 ఏళ్లుగా తెలుగుదేశం పార్టీలో పని చేస్తున్న, ఈ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నేత, మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తికి టికెట్ లేకుండా పోయింది. దీనిపై పెందుర్తి నియోజకవర్గం టిడిపి శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. టికెట్ రాకపోవడంతో అలిగిన బండారు సత్యనారాయణమూర్తి అనారోగ్యానికి గురై రెండు వారాలుగా ఇంటికే పరిమితమయ్యారు. ఈ నేపథ్యంలో టిడిపి శ్రేణులు ఎటూ కదలక స్తబ్ధతగా ఉన్నారు. పెందుర్తి నియోజకవర్గంలో బిజెపి అంతంత మాత్రంగా ఉంది. దీంతో జనసేన పార్టీ ఒంటరి పోరు చేయాల్సి వస్తోంది.

జనసేన నిర్వహించే సమావేశాలకు కూడా టిడిపి శ్రేణులు హాజరు కావడం లేదు. ఈ విషయమై టిడిపి శ్రేణులను వివరణ కోరగా తమకు జనసేన నుండి ఎటువంటి సమాచారం లేదని పలువురు నేతలు చెబుతున్నారు. అయితే కొంతమంది టీడీపీ నేతలు పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకే నడుచుకుంటామని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం జనసేన అభ్యర్థి పంచకర్ల రమేష్‌బాబు తమ కార్యకర్తలతో కలిసి శుక్రవారం కొంతమంది టిడిపి నేతలను కలిశారు. టీడీపీ ప్రభుత్వం రాగానే బండారుకు సముచిత స్థానం కల్పిస్తామని అధిష్టానం రాయబారం పంపినట్లు విశ్వసనీయ సమాచారం. దీనిపై బండారు ఇంతవరకు ఎటువంటి నిర్ణయం తీసుకోలేదు. ఏది ఏమైనా పెందుర్తిలో జనసేనకు తిప్పలైతే తప్పేలా లేవు.

ప్రభుత్వ భవనాలకు వెళ్లే మార్గంలో

ఎట్టకేలకు కల్వర్టు మంజూరు

▶▶ 'ప్రజాశక్తి' కథనాలకు స్పందించిన అధికారులు

▶▶ చకచకా సాగుతున్న నిర్మాణ పనులు

కొండవాలు గెడ్డపై జరుగుతున్న కల్వర్టు పనులు

ప్రజాశక్తి-కోటవురట్ల : మండలంలో పందూరు సచివాలయ పరిధిలో నిర్మించిన రైతు భరోసా, వెల్నెస్ సెంటర్లకు సరైన దారి లేకపోవడంతో ఆయా ప్రభుత్వ భవనాలకు వెళ్లేందుకు సిబ్బందితోపాటు ప్రజలు తీవ్ర అవస్థలు పడేవారు, దీనిపై ప్రజాశక్తిలో పలుమార్లు వచ్చిన కథనాలకు అధికారుల్లో కదలిక వచ్చింది. ఆయా ప్రభుత్వ భవనాలకు వెళ్లేందుకు కొండవాలులో గెడ్డ అడ్డంగా ఉండడం, దానిపై కల్వర్టు లేకపోవడం కారణంగా సచివాలయ పరిధిలో రామచంద్రపురం, అల్యూమినియపాలెం, గూడుపులోవ, మునగల లోవ, బంధ గ్రామాలు ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రజాశక్తి వెలుగులోకి తెచ్చింది. అలాగే రైతు భరోసా కేంద్రానికి వెళ్లేందుకు, విత్తనాలు ఎరువులు తీసుకెళ్లేందుకు దారి లేక అవస్థలు పడ్డారు. అంతేకాక వెల్నెస్ సెంటర్‌కు చికిత్సకు వచ్చే గర్భిణులుచ వృద్ధులు, ఇతర రోగులు గెడ్డ వద్ద దాటి వెళ్లేందుకు నానా ఇక్కట్లకు గురయ్యారు. ఇక్కడి పరిస్థితులన్నీ కళ్లకు కట్టినట్లు ప్రజాశక్తి కథనంలో ప్రచురించడంతో అధికారులు స్పందించారు. ప్రస్తుతం భవనాలకు వెళ్లే మార్గంలో కల్వర్టు నిర్మాణానికి రూ. నాలుగు లక్షలు మంజూరు చేయడంతో ప్రస్తుతం కల్వర్టు పనులు సాగుతున్నాయి, దీంతో ఆయా గ్రామాల ప్రజలకు ప్రభుత్వ భవనాలకు వెళ్లేందుకు రోడ్డు కష్టాలు తీరి, ఊరట లభించనుంది.

మత్స్యకార కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థిక సహాయం అందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు

ప్రజాశక్తి-గొలుగొండ : ఇటీవల తాండవ జలాశయంలో బోటు మునిగి మృతి చెందిన పొగచెట్లపాలెం గ్రామానికి చెందిన మత్స్యకారుడు గరగల అప్పారావు కుటుంబానికి హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ అధ్యక్షులు టీ.మల్లేష్ మాట్లాడుతూ భార్య, ముగ్గురు ఆడపిల్లలతో చేపల వేటకు వెళ్లి వచ్చే అరకొర డబ్బులతో కుటుంబాన్ని పోషించుకునే వ్యక్తి అకస్మాత్తుగా పడవ బోల్తా పడి చనిపోయిన విషయాన్ని సామాజిక మాధ్యమాల ద్వారా తెలుసుకొని హెల్పింగ్ హ్యాండ్స్ తరపున ఎంతో కొంత సహాయం చేయాలనే ఆలోచనతో హెల్పింగ్స్ హ్యాండ్స్ సభ్యులు, దాతల సహకారంతో రూ.15వేలు సేకరించామని, అలాగే కొంటా బాలకృష్ణ, వరలక్ష్మీ దంపతులు వారి స్నేహితులు రూ.4వేలు అందించగా మొత్తం రూ.19వేలను అందించామన్నారు. కార్యక్రమంలో సభ్యులు సన్యాసిరావు, చిట్టయ్య, రామరాజు, నూకరాజు, తిరుపతిబాబు, హరిదేవ్, లక్ష్మణ్, కొంటా బాలకృష్ణ, రాజేష్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

రేపు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి కోటవురట్ల : మండలంలోని కోటవురట్ల సబ్ స్టేషన్ పరిధిలోని రాజుపేట, రామన్నపాలెం, బికె.పల్లి, ఎండపల్లి, కె.తంగేడు, రామచంద్రపురం గ్రామాలకు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయనుండడంతో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనున్నట్లు ఎపిఇపిడిసిఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు విడివి రామకృష్ణారావు తెలిపారు,. ఆయా గ్రామ ప్రజలు సహకరించాలని స్థానిక ఇంజనీరు మహేష్ కోరారు.

నేడు 'మేలుకో మహిళా'కార్యక్రమం

మాట్లాడుతున్న చింతకాయల విజయ్

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : వైసిపి ప్రభుత్వంలో మహిళలపై జరిగిన అరాచకాలు, తెలుగుదేశం పార్టీ మహిళల కోసం చేసిన కృషిని వివరించడం కోసం 6న బలిఘట్టం వద్ద మేలుకో మహిళ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఈ సభకు కేవలం మహిళలు మాత్రమే హాజరవుతున్నట్టు తెలిపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో స్త్రీలపై లైంగిక దాడులు పెరిగాయని, హత్యలు అత్యాచారాలు విచ్చలవిడిగా జరుగుతున్నా, వాటిని అరికట్టడంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి విఫలమయ్యాడని విజయ్ ఆరోపించారు. కౌన్సిలర్ చింతకాయల పద్మావతి మాట్లాడుతూ మేలుకో మహిళా కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో మహిళలకు హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి సుకల రమణమ్మ, తెలుగుదేశం పార్టీ మహిళా కౌన్సిలర్లు పాల్గొన్నారు.

గురందొరపాలెంలో పోలీసుల కార్డెన్ సెర్చ్

కార్డెన్ సెర్చ్ తనిఖీలు చేస్తున్న పోలీసులు

ప్రజాశక్తి- అనకాపల్లి డెస్క్ : నర్సీపట్నం డిఎస్పీ మోహన్ ఆధ్వర్యంలో నర్సీపట్నం మండలంలోని గురందొరపాలెం గ్రామంలో పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ నేరాల నియంత్రానికి కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గంజాయి, నాటు సారా వ్యాపారాల్లో పాత కేసులు ఉన్న వారిని గుర్తించారు. సరైన పత్రాలు లేని వాహనాలన్నీ సీజ్ చేశారు. ఈ సెర్చ్ ఆపరేషన్లో సుమారు 120 మంది పోలీసులు పాల్గొన్నారు. గ్రామంలో ఎక్కడైనా గంజాయి నిల్వలు ఉన్నాయనే అనుమానంతో డాగ్‌స్క్వాడ్ ద్వారా తనిఖీలు నిర్వహించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే శిక్షలు కఠినంగా ఉంటాయని ఆ గ్రామస్తులకు డిఎస్‌పి విరించారు.